ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
గురువారం 9 అక్టోబరు 2025



మాచవరం : సరస్వతి పరిశ్రమ పేరుతో కొనుగోలు చూసిన భూమి

కలలు.. కల్లలే

- పరిశ్రమల్లో ఉద్యోగాలంటూ మోసం
- ఏళ్లు గడుస్తున్నా పునాది పడని సిమెంట్ పరిశ్రమలు
- అటు పొలం లేక.. ఇటు ఉపాధి లేక అవస్థలు

పిడుగురాళ్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పొలాలు ఇవ్వండి.. పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం.. యువతకు ఉద్యోగాలు ఇస్తాం.. అంటూ పారిశ్రామికవేత్తలు కల్పించిన ఆశలతో ఉపాధిపై కలలు కన్నారు. అయితే ఏళ్లు గడుస్తున్నా వారి కలలు నెరవేరడం లేదు. అటు పొలాలు కోల్పోయి.. ఇటు ఉపాధి లేక అల్లాడుతున్న గ్రామీణుల ఆశలను పారిశ్రామికవేత్తలు చిదిమేశారు. దశాబ్దాల క్రితం సిమెంట్ ఫ్యాక్టరీలు నిర్మిస్తామని గురజాల, దాచేపల్లి, మాచవరం మండలాల్లోని సుమారు 25 గ్రామాల్లో 2,189 మంది రైతుల నుంచి 4,258 ఎకరాల భూములను అంబుజ (ఇప్పుడు అదాని), మైహోమ్, రాజపుష్ప, ఇమామి, సంఘీ, సరస్వతి కంపెనీలు సేకరించాయి. అయితే ఏళ్లు గడుస్తున్నా పరిశ్రమలకు పునాది వేయలేదు. ఫ్యాక్టరీల నిర్మాణాలు కాగితాలకే పరిమితమవగా భూములిచ్చిన రైతులు ఇప్పుడు కూలీలుగా మారారు. ఒకప్పుడు పంటలతో సస్య శ్యామలంగా ఉన్న భూములు ప్రస్తుతం అడవులను తలపిస్తున్నాయి.భూములు తిరిగి ఇవ్వాలని కోరుతున్నా తమ గోడు ఎవరూ వినిపించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమల స్థాపించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతు కుటుంబాలు కోరుతున్నాయి.



దాచేపల్లి :సిమెంట్ పరిశ్రమలకు కొనుగోలు చేసిన భూములు

కొనుగోళ్లు ఇలా..

- నడికూడి సమీపంలో ఫ్యాక్టరీని ప్రారంభిస్తామని 25 ఏళ్ల క్రితం అంబుజ సిమెంట్(అదాని) నడికూడి, బూదవాడ, గోగులపాడు, కాచారం, ఇనుపరాజుపల్లె, అంబాపురం గ్రామాల్లో 900 ఎకరాలను కొనుగోలు చేసింది. మరో 2 వేల ఎకరాలు ప్రభుత్వ భూమిని మైనింగ్ లీజ్‌కు తీసుకుంది.
- గామాలపాడు వద్ద మై హోమ్ సిమెంట్ ఫ్యాక్టరీని నిర్మిస్తామని సుమారు 15 ఏళ్ల క్రితం దాచేపల్లి మండలం గామాలపాడు, శ్రీనగర్ ప్రాంతాల మధ్య 700 మంది రైతుల నుంచి 1500 ఎకరాలు కొనుగోలు చేసింది. మరో వెయ్యి ఎకరాలు మైనింగ్ లీజ్‌ను పొందింది.
- దాచేపల్లి మండలం సారంగపల్లి అగ్రహారం, మాదినపాడు, తంగెడ గ్రామాల పరిధిలో వంద మంది రైతుల వద్ద రాజపుష్ప పరిశ్రమ నిర్వాహకులు సుమారు 200 ఎకరాల భూములు కొనుగోలు చేశారు. 15 ఏళ్లు గడుస్తున్నా నేటికీ పరిశ్రమ ఊసేలేదు.
- దాచేపల్లి మండలంలోని తంగెడ, కొత్తూరు, సారంగపల్లి అగ్రహారం గ్రామాల పరిధిలో ఇమామి సంస్థ నిర్వాహకులు 400 ఎకరాల భూములు కొనుగోలు చేశారు. మరో 600 ఎకరాలు మైనింగ్ లీజ్ పొందారు.
- గురజాల మండలంలోని దైద సమీపంలో ఫ్యాక్టరీ నిర్మిస్తామని సంఘీ యాజమాన్యం దైద, గొట్టిముక్కల గ్రామాల పరిధిలో సుమారు 108 ఎకరాల భూములను కొనుగోలు చేసింది. 4,950 ఎకరాల లీజు పొందింది. మరో 493 ఎకరాల ప్రభుత్వ భూమిని అప్పటి ప్రభుత్వం కేటాయించింది.

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులకు చెందిన సరస్వతి పవర్ ఇండస్ట్రీస్ పేరుతో మాచవరం మండలం వేమవరం, చెన్నాయపాలెం, తంగెడ, ముత్యాలంపాడు, పిన్నెల్లి గ్రామాల పరిధిలో సుమారు 1150 ఎకరాల భూములను 18 ఏళ్ల క్రితం 350 మంది రైతుల వద్ద కొనుగోలు చేశారు. మైనింగ్ లీజ్ కూడా పొందారు. అనేక అక్రమాలు వెలుగులోకి రావడంతో లీజ్‌లను ప్రభుత్వం రద్దు చేసి ప్రభుత్వం భూములను స్వాధీనం చేసుకున్నది.

అర్హులకే.. అవకాశం

పేదరికాన్ని రూపుమాపి తద్వారా రాష్ట్రాన్ని సంపన్నవంతం.. ఆరోగ్యవంతం.. ఆనందంగా మార్చేలా రాష్ట్ర ప్రభుత్వం పీ-4 ప్రవేశపెట్టి ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోంది. అయితే ఇందులో అర్హులకే అవకాశం దక్కేలా మార్గదర్శకాలను రూపొందించింది. ఈ ప్రకారం మూడు నెలలుగా ప్రత్యేకంగా సర్వే చేపట్టింది. పథకం ప్రారంభించినప్పుడు బంగారు కుటుంబాల ఎంపికలో సరైన మార్గదర్శకాలు పాటించలేదని ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో ఎంపికకు ఐదు అంశాలతో కూడిన మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేసింది. సచివాలయ సిబ్బంది వాటి ఆధారంగానే ఇంటింటి సర్వేను మరోమారు చేపట్టి అర్హుల జాబితా ను యాప్‌లో అప్‌లోడ్‌తో పాటు, తొలి జాబితాలో చేర్చిన కొన్ని కుటుంబాలను అనర్హులుగా తేల్చారు. ఎట్టకేలకు పీ-4 పథకానికి అర్హులైన బంగారు కుటుంబాల జాబితా సిద్ధమైంది.

- బంగారు కుటుంబాల జాబితా సిద్ధం
- ఐదు అంశాల ప్రామాణికంగా పీ-4 సర్వే
- ముమ్మరంగా మార్గదర్శకుల అనుసంధానం



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పేదరికంతో ఇబ్బంది పడుతున్న కుటుంబాలను ఆదుకునేలా.. వారిని సమాజం దత్తత తీసుకుని ఆదుకునేలా పీ-4ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ పథకం ఫలాలు అర్హులైన వారికే అందాలని, దాని కోసం ఐదు అంశాలు ప్రామాణికంగా ఇంటింటి సర్వేను చేపట్టింది. క్షేత్రస్థాయిలో ఆ కుటుంబాలను మార్గదర్శకాలకు అనుసంధానం చేసే ప్రక్రియను సచివాలయ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే 70 శాతం కుటుంబాల మ్యాపింగ్ పూర్తయిందని, వారి వారి స్థితిగతులను దృష్టిలో పెట్టుకుని మార్గదర్శకులను అటాచ్ చేస్తున్నామని, ఆ ప్రక్రియ మరో వారం రోజుల్లో ఓ కొలిక్కి వస్తుందని అధికారులు చెబుతున్నారు. సచివాలయాల వారీగా బంగారు కుటుంబాల జాబితాను గతంలో గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీలు వారీగా సిద్ధం చేశారు. అయితే ఎంపికలో సరైన మార్గదర్శకాలు పాటించకపోవడంతో జిల్లాలో అనర్హులు పెద్ద సంఖ్యలో చేరారని తేలింది. ఈ పరిస్థితుల్లో అర్హులను ఎంపిక చేసేలా ప్రభుత్వం ఐదు అంశాలను నిర్దేశించింది. ఈ ప్రకారం బంగారు కుటుంబాల వివరాలు యాప్‌లో నిక్షిప్తం చేయాలని, ఇదంతా కూడా పారదర్శకంగా (మిగతా 6వ పేజీలో)

తగ్గిన బంగారు కుటుంబాలు

బాపట్ల జిల్లాలో సర్వే అనంతరం తుది జాబితాలో 51,304 బంగారు కుటుంబాలకు చోటుదక్కింది. పథకం ప్రకటించిన తొలినాళ్లలో జిల్లా వ్యాప్తంగా 70,983 కుటుంబాలకు పీ-4లో చోటు కల్పించారు. ఇటీవల నిర్వహించిన సర్వేలో 15,179 కుటుంబాలను అనర్హులుగా తేల్చారు. జిల్లాలో 5,158 మందిని మార్గదర్శకులుగా గుర్తించారు. గుంటూరు జిల్లాలో గతంలో 78 వేలు బంగారు కుటుంబాలు ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 48 వేలకు పరిమితమైంది. పల్నాడు జిల్లాలో 76800 బంగారు కుటుంబాలను ఎంపిక చేశారు. మూడు జిల్లాల్లో గతానికి ఇప్పటికీ బంగారు కుటుంబాల సంఖ్యలో తగ్గుదల కనిపిస్తోంది.

అదనపు రవాణా చార్జీలపై లేఖాస్త్రం

సమస్యను పరిష్కరించాలని ఎస్పీ రవాణా శాఖ కమిషనర్‌కు మార్కెటింగ్ డైరెక్టర్ ఆదేశాలు 6లో..

మాచర్ల నుంచి కృష్ణపట్నం



- యథేచ్ఛగా రేషన్ బియ్యం అక్రమ రవాణా
- ఓ గ్రామంలోని రైస్‌మిల్లులో రీసైక్లింగ్

నరసరావుపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం మాచర్ల ప్రాంతం నుంచి నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం పోర్టుకు అక్రమంగా తరలిపోతోంది. పేదల బియ్యాన్ని సేకరించి రైస్‌మిల్లులో రీసైక్లింగ్ చేసి అక్రమార్కులు తరలిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఉన్నట్లుగానే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా రేషన్ మాఫియా కొనసాగుతోంది. మాచర్ల పట్టణం, మాచర్ల మండలం, రెంటచింతల, దుర్గి, వెల్దుర్తి, కారంపూడి మండలాల నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని మాచర్ల సమీపంలోని ఓ గ్రామంలోని రైస్ మిల్లుకు తరలించి రీసైక్లింగ్ చేసి అక్కడి నుంచి కృష్ణపట్నం పోర్టుకు తరలిస్తున్నారు. మండలానికి 150 క్వింటాళ్ల చొప్పున 900 క్వింటాళ్ల బియ్యం సేకరిస్తున్నట్లు సమాచారం. కార్డుదారులకు బియ్యం బదులు కేజీకి రూ.10 చొప్పున చెల్లిస్తున్న డీలర్లు దళారులకు రూ.17కి విక్రయిస్తున్నారు. వారు వీటిని రూ.23కి మాఫియా ముఠాలకు విక్రయిస్తున్నారు. మాఫియా ముఠాలు ఈ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి కేజీ రూ.35 చొప్పున కృష్ణపట్నంకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. నియోజకవర్గంలో రాత్రి వేళల్లో మాఫియాలు చీకటి వ్యాపారానికి పాల్పడుతున్నారు.

స్థావరం మార్చి..

రేషన్ మాఫియా మొదట రెంటచింతల మండలం మంచికల్లు గ్రామంలో ఓ రైస్‌మిల్లును లీజుకు తీసుకుని రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి తరలించేది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక స్థానిక నేత చీకటి వ్యాపారినికి అంగీకరించ లేదు. దీంతో రేషన్ మాఫియా రెండు నెలల క్రితం మాచర్లకు ఆనుకుని ఉండే ఒకప్పటి ఫ్యాక్షన్ గ్రామానికి స్థావరం మార్చింది. అక్కడ ఓ పాత రైస్ మిల్లును లీజుకు తీసుకుని మిషనరీ ఆధునికీకరించి రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి కృష్ణపట్నం పోర్టుకు తరలిస్తోంది. పేదల బియ్యం పక్కదారి పడుతుంటే నియంత్రించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అక్రమార్కులకు అధికారుల సహకారం..

రేషన్ బియ్యం అక్రమాల్లో అక్రమార్కులకు అధికారులు సహకరిస్తున్నట్లు ఇటీవల చోటుచేసుకున్న ఓ ఘటన నిదర్శనంగా కనిపిస్తోంది. మాచర్లలోని నెహ్రూనగర్‌లో అనధికారికంగా కొనసాగుతున్న ఓ డీలర్ సుమారు 150 బ్యాగుల రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచినట్లు ఇటీవల డివిజన్ స్థాయి అధికారికి ఫిర్యాదు వెళ్లింది. దీంతో తనిఖీ చేయాలని రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించగా ఆ డీలర్ నుంచి మామూళ్లు దండుకుని ఏమీ లేవన్నట్లుగా నివేదిక పంపారు. అయితే మళ్లీ ఫిర్యాదు రావడంతో ఆ అధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సారి ఆ డీలర్‌కు సమాచారమిచ్చి బియ్యాన్ని రాత్రికి రాత్రే తరలించేలా చేసి బియ్యం లేనట్లుగా నివేదికను పంపారు. ఇలా అక్రమార్కులకు అధికారులు సహకరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

రేషన్ బియ్యం స్వాధీనం..

కారంపూడి: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వాసు తెలిపారు. లారీలో తరలివెళ్తున్న 90 బ్యాగులను కారంపూడిలో స్వాధీనం చేసుకున్నామని, ఒక్కో బ్యాగు 40 కేజీలు ఉన్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం లారీ

బొల్లాపల్లిలో కలెక్టర్ పర్యటన

ఉపాధి హామీ పనుల్లో భాగమైన జిల్లా అధికారి

బొల్లాపల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బొల్లాపల్లిలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్ల బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. ఉపాధి హామీ పథకం కింద ఏర్పాటు చేసిన కొబ్బరి తోట, ఫాం పాండ్ల పనులను పరిశీలించారు. అంతర పంటలుగా అపరాలు, కూరగాయలు సాగు చేసి అదనపు ఆదాయం పొందాలని రైతులకు సూచించారు. గ్రామానికి చెందిన గుజ్జుల వెంకటరెడ్డి పొలంలో కొబ్బరి మొక్క నాటిన కలెక్టర్.. గడ్డపార చేతబట్టి సేద్యపు కుంట పనుల్లో ఉపాధి కూలీలతో పాటు పాల్గొన్నారు. గ్రామంలోని మైక్రో ఇరిగేషన్ ట్యాంకును, నిరుప యోగంగా ఉన్న ఇరిగేషన్ చెరువును పరిశీలించారు. ఇది వినియోగంలోకి వచ్చినట్లయితే వెయ్యి ఎకరాలు సాగులోకి తీసుకురావచ్చని అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అనంతరం సచివాలయం వద్ద ఇంకుడు కుంట, వర్మి కంపోస్టు తయారీని కృతికా శుక్ల పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో వర్షంలోనూ ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. డ్వామా పీడీ ఎం.సిద్ధలింగ మూర్తి, ఇరిగేషన్ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో కలెక్టర్ కృతికా శుక్లా

ఆంధ్రజ్యోతి కథనంపై స్పందించిన కలెక్టర్

బొల్లాపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఆంధ్రజ్యోతిలో బుధవారం 'ప్రేతాత్మలతో ఉపాధి పనులు' శీర్షికన వెలువడిన కథనంపై కలెక్టర్ కృతికా శుక్ల స్పందించారు. చనిపోయిన వారి పేర్లతో వేతనాలు వేయడం ఏంటని? ఆమె సంబంధిత అధికారులను, ఉపాధి హామీ సిబ్బందిని ప్రశ్నించారు. దీంతో ఒక్కసారిగా జిల్లా యంత్రాంగం మొత్తం ఒకింతకు ఆందోళనకు గురైంది. సంబంధిత ఉపాధి హామీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

రహదారుల అభివృద్ధికి.. రూ.18.40 కోట్లు

- ప్రభుత్వం నుంచి పరిపాలన అనుమతులు



అభివృద్ధి చేయనున్న సాతులూరు - దింటెనపాడు రహదారి

నరసరావుపేట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఐదు రహదారులకు మహర్దశ పట్టనుంది. రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఇందుకు రూ.18.40 కోట్లు వ్యయం చేయనున్నారు. కొండ్రముట్ల - బండమోడు - దుర్గి రహదారి 25వ కిలోమీటరు నుంచి 40 కిలోమీటరు వరకు 15 కిలో మీటర్ల మేర అభివృద్ధి చేయనున్నారు. ఈ పనులకు రూ.5 కోట్లు, నకరికల్లు - గురజాల రహదారి 30/2 నుంచి 31/2 వరకు కిలోమీటరు అభివృద్ధికి రూ.40 లక్షలు నిధులు మంజూరయ్యాయి. మాచర్ల - వీపీ సౌత్ రహదారి మూడు ప్రాంతాల్లో 11.4 కిలోమీటర్ల అభివృద్ధికి రూ.5 కోట్లు నిధులు ప్రభుత్వం కేటాయించింది. రూ.3 కోట్ల వ్యయంతో గుంటూరు - అమరావతి రహదారి 32 నుంచి 34.60వ కిలోమీటరు వరకు 2.61 కిలో మీటర్లు అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ పనులు చేపట్టేందుకు ఆర్ అండ్‌బీ శాఖ టెండర్లు పిలవనుంది. ఐదు రహదారుల అభివృద్ధి చేపట్టడంతో వాహనదారుల ప్రయాణ కష్టాలు తీరనున్నాయి.

క్వారీ..ఆరోగ్యానికి గోరీ!

- కలుషితమవుతున్న మున్సిపల్ రిజర్వాయర్(క్వారీ)
- మాచర్ల పట్టణానికి ప్రధాన తాగునీటి వనరు
- ఇక్కడే కాలకృత్యాలు, స్నానాలు చేస్తున్న వైనం



క్వారీలో స్నానం చేస్తున్న వ్యక్తులు

మాచర్ల రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణ మున్సిపల్ రిజర్వాయర్ (క్వారీ) నుంచి పట్టణ ప్రజలకు నిత్యం తాగునీరు సరఫరా అవుతోంది. పట్టణంలోని 70 శాతం మంది జనాభా ఈ నీటినే తాగి దాహార్తిని తీర్చుకుంటున్నారు. అటువంటి రిజర్వాయర్‌ను వ్యర్థాలకు నిలయంగా మారుస్తున్నారు. మల, మూత్ర విసర్జనలతో పాటు ఇక్కడే స్నానాలు చేస్తున్నారు. క్వారీ రక్షణ కల్పించాల్సిన అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కలుషిత నీటిని తాగిన పట్టణ ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు.

పురపాలక ప్రజలకు తాగునీరు

మాచర్ల పట్టణ పురపాలక సంఘం జనాభా సుమారు 70 వేలకు పైగా ఉంటుంది. ఇందులో దాదాపు 70 శాతం పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే. వీరంతా కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మున్సిపల్ క్వారీ నీటినే తాగునీటికి వినియోగిస్తున్నారు. ద్వితీయశ్రేణి పురపాలక సంఘంగా ఉన్న మాచర్ల పట్టణంలో తాగునీరు కలుషితమవుతోంది. సాగర్ రోడ్డులో ప్రహరీ కూల్చివేయడంతో ఆ మార్గం గుండా ఉదయం సమయంలో కొందరు మున్సిపల్ క్వారీకి చేరుకొని కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. మందు బాబులు మద్యం సేవించి సీసాలను క్వారీలోనే పడేస్తున్నారు. క్వారీ వద్ద హెచ్చరిక బోర్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి.. భద్రత చర్యలు చేపట్టాల్సిన అధికారులు మాత్రం ఆ దిశగా అడుగులు వేయడం లేదు. ప్రతి నెలా నీటి నాణ్యత పరీక్షలు చేయాల్సి ఉన్నప్పటికీ అవేమీ అధికారులకు పట్టడం లేదు.

కంచె ఏర్పాటు చేస్తాం

మున్సిపల్ క్వారీ చుట్టూ కంచె ఏర్పాటు చేస్తాం. క్వారీలోకి ఎవరూ దిగకుండా సిబ్బందిని కాపలాగా ఉంచుతాం. క్వారీ నీరు కలుషితం కాకుండా చర్యలు చేపడతాం. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- మున్సిపల్ కమిషనర్ వేణుబాబు



అధిక పురుగుమందులతో నష్టం

- పంటకు మేలు చేసే మిత్ర పురుగుల మృతి
- రైతులతో జిల్లా వ్యవసాయ శాఖాధికారి జగ్గారావు

ముప్పాళ్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పంటలకు అవసరమైన మేరకే పురుగుమందులను పిచికారీ చేయాలని, అనవసరంగా కొట్టడం వల్ల పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు సాలీడు,



దమ్మాలపాడులో ఆన్‌లైన్‌లో పంట నమోదు చేసిన పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జగ్గారావు

తూనీగలు చనిపోతాయని జిల్లా వ్యవసాయ శాఖాధికారి జగ్గారావు తెలిపారు. మండలంలోని దమ్మాలపాడులో బుధవారం పంట నమోదుకు సంబంధించిన సూపర్‌చెక్ రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేసిన సాగుచేసిన భూమిలోని పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. పంటకు బలం మందు వేసేటప్పుడు పొలంలో నీటిని తక్కువగా ఉండేలా చూడాలని, తద్వారా పంటకు ఎరువుల లభ్యత పెరుగుతుందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి వెంట ఏఈఓ ఎన్ శేషుబాబు, వీహెచ్‌ఏ నరేష్, ఎంపీఈవో రవి తదితరులు ఉన్నారు.

పిన్నెల్లి సోదరుల విచారణ వాయిదా

మాచర్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, సోదరుడు వెంకట్రామిరెడ్డి బుధవారం మాచర్ల రూరల్ పోలీస్‌స్టేషన్లో పోలీసుల విచారణకు హాజరుకావాల్సి ఉండగా.. ఈ నెల 10వ తేదీకి విచారణ వాయిదా పడింది. వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన టీడీపీ నేతలు జవిశెట్టి సోదరుల జంట హత్యల కేసులో పిన్నెల్లి సోదరులు ఏ6, ఏ7 నిందితులుగా ఉన్నారు. ముందస్తు బెయిల్ పిటీషన్ సుప్రీం కోర్టులో విచారణ కొనసాగుతుండడంతో పిన్నెల్లి సోదరులు అందుబాటులో లేరు. దీంతో విచారణను పోలీసులు వాయిదా వేశారు.

అనుమానాస్పద మృతి కేసులో వివరాలు లభ్యం

యడ్లపాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయపాలెం - సంగంగోపాలపురం మార్గంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి కేసులో.. వివరాలను పోలీసులు సేకరించారు. మృతుడు గుంటూరులోని సంగడిగుంటకు చెందిన షేక్ రహీం(47)గా గుర్తించారు. చెంఘీజ్‌ఖానపేట గ్రామానికి చెందిన స్నేహితుడు రాళ్ళబండి శివనాగేంద్రబాబుతో కలిసి అతను సోమవారం రాత్రి ఆటోలో గుంటూరు నుంచి చెంఘీజ్‌ఖాన్ పేటకు బయలుదేరాడు. శివనాగేంద్రబాబు అతివేగం కారణంగా.. ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఆటోలో వెనుక కూర్చున్న రహీం రోడ్డుపై పడడంతో తల ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే శివనాగేంద్రబాబు రహీం మృతదేహాన్ని అక్కడే వదిలివేసి ఆటోను తీసుకుని గ్రామంలోకి పారిపోయాడు. ఘటనా స్థలంలో లభించిన ఆధారాలతో ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ శివనాగేంద్రబాబును పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. అంతకముందు మృతుని తండ్రి షేక్ సైదా రాత్రి చిలకలూరిపేటలోని మార్చురీకి వచ్చి కుమారుడి మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు.

రెండు చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు

● రూ.10లక్షల విలువైన బంగారం, నగదు స్వాధీనం

నరసరావుపేట లీగల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మొదటి పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఏడాది జూన్, సెప్టెంబరులో జరిగిన వివిధ చోరీ కేసుల్లో నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ ఎంవీ చరణ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. జూన్‌లో పట్టణానికి చెందిన దాసరి ప్రణీత గృహంలో బంగారు ఆభరణాలు చోరీ చేసిన పనిమనిషి అమరారపు భూలక్ష్మిని, సెప్టెంబరు 4న డాక్టర్ కడియాల వెంకటేశ్వరావు వైద్యశాల వద్ద కుడిమల ఏడుకొండలు గృహంలో చోరీ చేసిన పాత నేరస్తుడు షేక్ బాజీని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. నిందితుడు బాజీపై పదికి పైగా పిక్ పాకెట్ కేసులు ఉన్నట్లు తెలిపారు. నిందితుల నుంచి రూ.10 లక్షల విలువైన నగదు, బంగారపు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ వంశీకృష్ణ, నేర విభాగ కానిస్టేబుళ్లు వీరాంజనేయులు, మురళీకృష్ణను సీఐ అభినందించారు.

అదనపు రవాణా చార్జీలపై లేఖాస్త్రం

● సమస్యను పరిష్కరించాలని ఎస్పీ, రవాణా శాఖ కమిషనర్‌కు మార్కెటింగ్ డైరెక్టర్ ఆదేశాలు



విజయ సునీత, మార్కెటింగ్ కమిషనర్ అండ్ డైరెక్టర్

గుంటూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మిర్చి రవాణా విషయంలో లారీ యూనియన్ల నాయకులు అధిక చార్జీలు డిమాండ్ చేస్తున్నారని, ఈ విషయాన్ని మిర్చి ఎగుమతిదారులు తమ దృష్టికి తీసుకొచ్చారని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ అండ్ డైరెక్టర్ ఎం.విజయ సునీత పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె బుధవారం రవాణా శాఖ రాష్ట్ర కమిష నర్, జిల్లా ఎస్పీకి వేర్వేరుగా లేఖలు రాశారు. ఈ విషయంలో లారీ యూనియన్లతో మాట్లాడి సమస్యని పరిష్కరించాల్సిందిగా కోరారు. మార్కెటింగ్ డైరెక్టర్ లేఖల దృష్ట్యా పోలీసు, రవాణా శాఖల ఉన్నతా ధికారులు ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు రంగంలోకి దిగే అవకా శాలున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.

యూనియన్ల వద్దే అసలు సమస్య..

ఈ సంవత్సరం ఫిబ్రవరి 22న సీఎం చంద్రబాబునాయుడు వద్ద జరిగిన సమావేశంలో మిర్చి ట్రేడర్లు ప్రధానంగా రవాణా చార్జీలు ఇతర మార్కెట్లతో పోల్చితే ఇక్కడ ఎక్కువగా ఉన్నాయని విన్నవించారని మార్కెటింగ్ కమిషనర్ తన లేఖలో పేర్కొన్నారు. దీని వల్ల అటు ఎగుమతిదారులకు, ఇటు రైతులకు నష్టం కలుగుతుం దన్నారు. ఇతర ఏఎంసీలతో పోల్చితే దాదాపుగా ఇక్కడి నుంచి ఈశాన్య రాష్ట్రాలకు లారీ కిరాయి విషయంలో రూ.35 వేల వ్యత్యాసం ఉందన్నారు. దీనికి ప్రధాన కారణం లారీ యూనియన్‌లేనని ఆరోపించారు. యజమానులు లారీలు కిరాయికి పెట్టడానికి సిద్ధంగా ఉన్నప్ప టికీ.. యూనియన్ నాయకులు అడ్డుకొంటున్నారన్నారు. ఇలాంటి సిండికేట్ వ్యవహారాలను నియంత్రించాలని ఇప్పటికే సీఎం ఆదేశాలు జారీ చేశారని గుర్తుచేశారు. వాటిని ఏడెనిమిది నెలల పాటు పాటించి మళ్లీ సమస్య పునరావృతం చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ విజయ సునీత విజ్ఞప్తి చేశారు.

ఈ సమస్య వారంలో పరిష్కారం కావాలి. లేకుంటే సీజన్‌లో సమస్య తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉంది. అసలే గత సీజన్‌లో ధర లేక మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కోల్డ్ స్టోరేజ్‌లలో నిల్వ చేసుకొన్న రైతులు ఇప్పుడు కాస్త మెరుగైన ధర క్వింటాకు రూ.15 వేలు పొందుతున్నారు. ఎగుమతులు నిలిచిపోతే ధర పతనం అవుతుంది. అంతేకాకుండా రాబోయే మిర్చి సీజన్ పైనా దాని ప్రభావం పడుతుంది.

ఆరు క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల




6 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

విజయపురిసౌత్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు బుధవారం 6 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కాగా, సాగర్ జలాశయం నీటిమట్టం 589.70 అడుగులు ఉంది. ఇది 311.14 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,040, ఎడమ కాలువ ద్వారా 8,022, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,942, 6 క్రస్ట్‌గేట్లను 5 అడుగులు మేర ఎత్తి 48,414, ఎస్ఎల్‌బీసీ ద్వారా 600, మొత్తం ఔట్‌ఫ్లో 1,01,018 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 1,01,018 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి

తాడేపల్లి టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణానది వర ద ఉధృతి కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్టుతోపాటు.. మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 2,35,419 క్యూసెక్కుల వరద నీరు బుధవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 2,17,350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 10,380, పశ్చిమ డెల్టాకు 7,508, గుంటూరు చానల్‌కు 181 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరద నీరు

స్వార్థ రాజకీయం కోసమే జగన్ విశాఖ పర్యటన

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజలు తిరస్క రించినా జగన్‌మోహన్‌రెడ్డికి బుద్ధి రాలేదని, విశాఖపట్నంలో శాంతిభ ద్రతలకు విఘాతం కలిగించే ఉద్దేశంతోనే వైసీపీ అధినేత పర్యటన ప్లాన్ చేస్తున్నారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ ఆరోపించారు. బుధవారం నరసరావుపేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొమ్మాలపాటి మాట్లాడుతూ ప్రజా సమస్యల కంటే రాజకీయ హడావుడి సృష్టించడమే ఈ పర్యటన అసలు ఉద్దేశమని పేర్కొన్నారు. వైద్య కళాశాలలపై చేస్తున్న రాద్ధాంతాన్ని ఆయన ఖండించారు. జగన్‌మోహన్‌రెడ్డికి పబ్లిక్, ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ విధానం, ప్రైవేటీ కరణకు మధ్య తేడా తెలియక అబద్ధపు ప్రచారం చేస్తున్నారని మండి పడ్డారు. వైద్య విద్యలో నాణ్యత పెంచి, మరిన్ని సౌకర్యాలను ప్రజలకు అందించే ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకొస్తున్న పీపీపీ విధానాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించడం బాధ్యతా రాహిత్యమన్నారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లా డుతూ.. వచ్చే నెలలో విశాఖపట్నంలో అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సు జరగనుందన్నారు. ఈ నేపథ్యంలో ఇలాంటి అలజడి పర్యటనలను జగన్ చేపడుతున్నారని విమర్శించారు. ఉనికి కోల్పోతున్న వైసీపీ గ్రాఫ్‌ను పెంచుకోవడం, క్యాడర్‌ను కాపాడుకోవడానికి యాత్ర ల పేరుతో.. డ్రామాలు చేస్తున్నారన్నారు. తెలుగు యువత అధ్యక్షుడు కుమ్మేత కోటిరెడ్డి, అధికార ప్రతినిధి షేక్ మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మాలపాటి, చిత్రంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల

అలజడి సృష్టించడానికే జగన్ కుట్రలు

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో శాంతిభద్రత లకు విఘాతం కలిగించే ఒకే ఒక్క ఉద్దేశంతోనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను ప్లాన్ చేశారని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. ప్రజా సమస్యల కంటే రాజకీయ హడావుడి సృష్టించడమే ఈ పర్యటన అస లు ఉద్దేశమన్నారు. బుధవారం ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో వైద్య కళాశాలలపై జగన్, వైసీపీ విమర్శలను ఆయన ఖండించారు. జగన్ రెడ్డి పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్) విధానం, ప్రైవేటీకరణ మధ్య తేడా తెలియక అబద్ధపు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పీపీపీ విధానంలో కళాశాలల్లోని సీట్లు, ఫీజులు పూర్తిగా ప్రభుత్వ నియంత్రణలోనే ఉంటాయని, ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఏ అంశమూ ఉండదని తెలిపారు. జగన్‌రెడ్డికి ఈ నిజాలు తెలిసినా.. కావాలనే వైద్య కళాశాలలపై అబద్ధపు ప్రచారం చేస్తున్నారన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

తెనాలి క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తెనాలి - విజయవాడ ప్రధాన రైలు మార్గంలో పెదవడ్లపూడి రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం ఉదయం గుర్తుతెలియని 35 సంవత్సరాల యువకుడు రైలు నుంచి జారి మృతి చెందాడని జీఆర్పీ ఎస్ఐ జి.వెంకటాద్రి తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి వ్యక్తిగత ఆధారాలు లభించలేదని, మృతుని చేతిపై వినోద్ అన్న పేరుతో పచ్చబొట్టు, ఒంగోలు రైల్వే స్టేషన్‌లో రాత్రి 12 గంటలకు తీసుకున్న ప్లాట్‌ఫాం టిక్కెట్ లభించాయన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం మత్తులో కారు డ్రైవర్ బీభత్సం

మంగళగిరి సిటీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎర్రబాలెం బసవతారక నగర్ వద్ద మద్యం మత్తులో ఓ కారు డ్రైవర్ బీభత్సం సృష్టించాడు. ర్యాష్ డ్రైవింగ్‌తో ఎదురుగా వచ్చిన కారును ఢీకొట్టాడు. కారులోని కుటుంబం అత్యవసర పనిమీద కావలి వెళ్లాల్సి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేయకుండానే వెళ్లిపోయారు. మద్యం మత్తులో తూగుతున్న డ్రైవర్ కొద్ది దూరం వెళ్లిన తర్వాత బసవతారక నగర్ కూడలి మలుపు వద్ద రోడ్డు పక్కనే ఉన్న టిఫిన్ బండితోపాటు సైకిల్‌ను ఢీకొట్టాడు. ఆ వెంటనే చెట్టును ఢీకొట్టడంతో డ్రైవర్ గాయపడ్డాడు. స్థానికులు డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. కారులో డ్రైవర్ సహా మొత్తం నలుగురు ఉన్నారని, అందరూ మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మంగళగిరి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామం వద్ద టాటా మ్యాజిక్ ఆటో ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఆటో డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది. మృతి చెందిన వ్యక్తి ఎర్రబాలెం గ్రామానికి చెందిన పున్నా శంకర్‌గా గుర్తించారు. ఆటో డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు.

అర్హులకే.. అవకాశం

(5వ పేజీ తరువాయి)

జరగాలని ప్రభుత్వం ఆదేశించింది. దాదాపు మూడు నెలల పాటు జరిగిన ఇంటింటి సర్వే ఇటీవలే ఓ కొలిక్కి వచ్చింది. దీంతో బంగారు కుటుంబాల జాబితాపై స్పష్టత వచ్చింది. దీంతో పీ-4కు అనర్హులుగా తేలుస్తూ ఆయా కుటుంబాల వివరాలను యాప్‌లో నుంచి తొలగించే ప్రక్రియ చేపట్టారు. గతంలో ఒక్కో మార్గదర్శకుడికి కనీసం పది బంగారు కుటుంబాలను అప్పగించాలనేది ప్రభుత్వ ఉద్దేశం. అయితే ప్రస్తుతం వారి ఇష్టం ఆధారంగా ఒక బంగారు కుటుంబాన్ని కూడా పీ-4 పథకం కిందకు చేర్చనున్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన...

తుది జాబితాలో చోటు దక్కించుకున్న బంగారు కుటుంబాలకు ప్రభుత్వం వైపు నుంచి అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అనే దానిపై తొలి దశ కసరత్తుపై యంత్రాంగం దృష్టి సారించింది. సాంకేతిక కారణాల వల్లనో లేక అవగాహన లేమితో వారు దరఖాస్తు చేసుకోకపోవడం వల్లనో పథకాలకు దూరంగా ఉంటే వారిని ఆయా పథకాల లబ్ధిదారుల జాబితాలో చేర్చనున్నారు. మలి దశలో భాగంగా మార్గదర్శకుల ద్వారా వారికి ఏ విధమైన తోడ్పాటు అందించాలో ఓ స్పష్టతకు రానున్నారు. తర్వాత మార్గదర్శకులను, బంగారు కుటుంబాలను ఒకే వేదిక మీదకు తెచ్చి అనుసంధానం చేసే కార్యక్రమాన్ని సచివాలయ ఉద్యోగులకు అధికారులు అప్పగించారు. ప్రస్తుతం పీ-4 జాబితా తుది రూపు తీసుకోవడం, మ్యాపింగ్ ప్రక్రియ కూడా పూర్తి కావడంతో తర్వాత ప్రక్రియలపై వడివడిగా అడుగులు పడుతున్నాయి.

ముగ్గురు ఎంపీడీఓలకు స్థాన చలనం

● యుగ కీర్తికి కమిషనరేట్‌లో పోస్టింగ్

గుంటూరు సిటీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ముగ్గురు ఎంపీడీఓలకు పరిపాలన సౌలభ్యం కోసం జడ్పీ సీఈఓ వీర్ల జ్యోతిబసు బుధవారం స్థాన చలనం కల్పించారు. కాకుమాను ఎంపీడీఓ యుగ కీర్తిని పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ ఆదేశాల మేరకు రాష్ట్ర కార్యాలయానికి డెప్యూటేషన్‌పై పంపారు. పల్నాడు జిల్లా రెంటచింతల ఎంపీడీఓ స్వరూప రాణిని నాదెండ్లకు డెప్యూటేషన్ వేశారు. నాదెండ్ల ఎంపీడీఓ శ్రీనివాసరావును రెంటచింతలకు బదిలీ చేశారు.

నేటి నుంచి కోటప్పకొండలో నిరుద్యోగులకు శిక్షణ

నకరికల్లు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు గురువారం నుంచి ఉచిత శిక్షణ, హాస్టల్ వసతి కల్పించనున్నట్టు జాబ్స్ కో-ఆర్డినేటర్ యరగాటి శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి ఉపాధి కల్పన సంస్థ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కాల్ సెంటర్ ఎగ్జిక్యూటీవులకు కంప్యూటర్ కోర్సు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. మూడు నెలల శిక్షణలో 18 నుంచి 27 ఏళ్ల వయసు కలిగి, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ విద్యార్హతలు గల యువత పాల్గొనవచ్చన్నారు. కోటప్పకొండలో రెడ్ల సత్రం ఎదురుగా ఉన్న స్కిల్ కళాశాలలో ఈ శిక్షణ ఇస్తారని తెలిపారు. మరిన్ని శిక్షణ వివరాలకు 99084 82907 నెంబరుకు సంప్రదించాలని పేర్కొన్నారు.

బీ ఫార్మసీ, ఫార్మా డీ పరీక్షలు ప్రారంభం



పరీక్షా కేంద్రంలో తనిఖీ చేస్తున్న సమన్వయకర్త ఆచార్య సుబ్బారావు

ఏఎన్‌యూ అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో బుధవారం బీ ఫార్మసీ రెండవ సెమిస్టర్ (రెగ్యులర్), ప్రథమ సెమిస్టర్ (సప్లిమెంటరీ)పరీక్షలతో పాటు ఫార్మా డీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. బీ ఫార్మసీ పరీక్షలకు 18 కేంద్రాలు, ఫార్మా డీ పరీక్షలకు 10 కేంద్రాలు కేటాయిం చారు. వర్సిటీ పీజీ, వృత్తి విద్యా కోర్సుల పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎం.సుబ్బారావు నరసరావుపేటలోని ఇండో అమెరికన్ ఫార్మసీ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రంలో వసతుల కల్పనపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. పగడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బుద్ధిలేని అబద్ధాల కోరు జగన్‌రెడ్డి: పిల్లి మాణిక్యరావు

గుంటూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బుద్ధీ, జ్ఞానం లేని అబద్ధాల కోరు జగన్మోహన్‌రెడ్డి అని ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు బుధవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్ధాలు, రెచ్చగొట్టడం, చంపడం, పరామర్శించడం వంటివి ఉంటేనే జగన్ రాజకీయాలు చేయగలడని ఆరోపించారు. మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం అమ్ముతున్నట్లు బుద్ధిలేని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పీపీపీ మోడల్‌కు, ప్రైవేట్ వ్యక్తులకి అంట గట్టడానికి తేడా తెలిసినా జగన్ రెచ్చగొట్టే రాజకీయాలు చేయాలనుకుంటున్నాడని దుయ్యబట్టారు. సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి పర్యటనల పేరుతో మూకలను రెచ్చగొట్టి తలలను కార్ల టైర్లతో తొక్కించి చంపి రాజకీయం చేయాలనుకున్నా రని ఆరోపణలు చేశారు. ఇప్పుడు విశాఖలో మహిళల వన్డే ప్రపంచ కప్ జరుగు తుంటే దానిని భంగం కలిగించాలనే దురుద్దేశంతో కూటమి ప్రభుత్వంపై అంతర్జాతీయంగా బురద చల్లాలనే ప్రయత్నం చేస్తున్నాడని మండిపడ్డారు. జగన్ లాంటి అరాచక శక్తులు రోడ్లపై తిరిగితే ప్రజలకు ప్రమాదం, రాష్ట్రానికి వినాశనమేనని.. జగన్‌ను ప్రజలే అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

50,096 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 51,707 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 50,096 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,520 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12200
334	10000	14500	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	14000	334	10500	14600
273	---	---	నెంబరు. 5	10000	14000
341	10000	15000	273	----	----
4884	----	----	341	10000	15000
సూపర్ 10	---	----	4884	10000	14500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15000	తేజ	10000	15000
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15500
బ్యాడిగి	10000	15400	దేవనూరు డీలక్స్	10500	14200
దేవనూరు డీలక్స్	10000	14000	తాలుకాయలు	5000	7200

ఫ్లోరోసిస్‌పై అవగాహన

సత్తెనపల్లి రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంకణాల పల్లిలో గల ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిరంలో జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణ కార్యక్రమంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫ్లోరోసిస్‌ను ఎలా నివారించాలో జిల్లా ఫ్లోరోసిస్ అధికారి గిరిధర్‌కుమార్ గ్రామ స్థాయిలో పనిచేసిన ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌వోలకు, మండల స్థాయి సూపర్‌వైజర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌వో తిరుమలవేణి, ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్తం...

● **సత్తెనపల్లి** : కోవిడ్ సమయంలో న్యాయవాదులకు రుణంగా అందించిన 10, 20వేలు ఆర్థికసాయాన్ని రుణమాఫీ చేయాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నరి చేటి వేణుగోపాలరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

● **సత్తెనపల్లి** : జిల్లా సమగ్ర శిక్ష అధ్వర్యంలో పట్టణంలోని సుగాలీకాలనీ ఉన్నత పాఠశాలలో బుధవారం మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల్లో ఏకాగ్రత, ఆత్మ విశ్వాసం, మానసిక ప్రశాంతత పెంచటమే కార్యక్రమ ప్రధాన లక్ష్యమని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కేలత ప్రియదర్శిని అన్నారు.

● **సత్తెనపల్లి** : పట్టణం, మండలంలోని మద్యం షాపులను ఎక్సైజ్ సీఐ విజయకుమార్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ సిబ్బంది బుధవారం ముమ్మరంగా తనిఖీలు చేశారు. కృష్ణా జిల్లాలో నకిలీ మద్యం వెలుగు చూసిన నేపథ్యంలో నియోజకవర్గంలోని అన్ని మద్యం షాపుల్లో తనిఖీలు నిర్వహించినట్టు సీఐ తెలిపారు. నకిలీ మద్యం విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

● **సత్తెనపల్లి** : పట్టణంలోని పరివర్తన పాఠశాలలో బుధవారం కేంద్ర మాజీ మంత్రి రామ్‌విలాస్ పాశ్వాన్ వర్ధంతిని లోక్ జనశక్తి పార్టీ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ విజయ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. కార్యక్రమంలో వెంకటరావు, గంగరాజు, సుభానీ, కిషోర్, రాబర్డు పాల్గొన్నారు.

● **అచ్చంపేట** : మండలంలోని పెద పాలెం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల ప్రాముఖ్యం తదితర అంశాలపై తల్లులకు అవగాహన కల్పించినట్టు పెదపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ కే పద్మ బుధవారం తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మతో పాటు అంగన్‌వాడీ కార్యకర్త వెంకటరావమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

● **అచ్చంపేట** : రైతులు వారి పంటలను ఈనెల 25వ తేదీ లోపు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి పీ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. కౌలు రైతులు తప్పని సరిగా కౌలుదారు కార్డులు పొందాలని, సంబంధిత వీఆర్‌వోను గానీ, రైతు సేవా కేంద్రంలో సంప్రదిస్తే కౌలుదారు కార్డు వెంటనే మంజూరు చేస్తారన్నారు.

● **అమరావతి** : డిసెంబరులో విశాఖపట్నంలో జరిగే సీఐటీయూ 18వ ఆలిండియా మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు జి.మల్లేశ్వరి అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారం జరిగిన మండలస్థాయి సీఐటీయూ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● **అమరావతి** : రిక్షా కార్మిక సంఘ నాయకుడు తుడుం కృష్ణ మృతికి సీపీఎం నాయకులు జి.రవిబాబు, బి.సూరిబాబు తదితరులు నివాళులు అర్పించి కుటుంబానికి తమ సానుభూతి తెలియ జేశారు.

● **రెంటచింతల** : స్థానిక సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం జీఎస్టీపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఎంఈవో-2 శివనాగేశ్వర రావు మాట్లాడుతూ తగ్గించి న జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

● **రెంటచింతల** : క్రీడలతో మంచి ఆరోగ్యాన్ని పొందొచ్చని ఉరుకుల పరుగుల జీవితాన్నుంచి ఉపశమనం పొందొచ్చని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ గోవిందు బాలస్వామి అన్నారు. బుధవారం రెంటచింతలలో ఎస్‌జీఎఫ్ఐ(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా)అండర్ 14, 17 ఆటల పోటీలను ప్రారంభించారు. మండలం నుంచి 10 పాఠశాలల బాలబాలికలు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంఈవో 2 శివ నాగేశ్వరరావు, హెచ్‌ఎం దుర్గా ప్రసాద్, పీఈటీలు సుభాని, కత్తి రవి, సురేష్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

● **దుర్గి** : ఉపాధి శ్రామికులకు ఈకేవైసీ తప్పనిసరి అని ఏపీవో మల్లికార్జున అన్నారు. బుధవారం ఆయన మండలపరిధిలోని గ్రామాల్లో ఉపాధి శ్రామికుల ఈకేవైసీని నిర్వహించారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో ఉన్న 21,047 మందికి 6094 మంది ఈకేవైసీ చేయించుకున్నారన్నారు. ఈకేవైసీ చేయించుకోకుంటే ఉపాధిహామీ పనికి అర్హతను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.

● **క్రోసూరు** : వైసీపీకి చెందిన నాయకులు చిత్తూరు జిల్లాలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి కుల వైషమ్యాలు రెచ్చగొట్టాలని చూడటం సిగ్గు చేటని క్రోసూరు మార్కెట్ యార్డు డైరెక్టర్ దుద్దుల యోహాన్ అన్నారు. టీడీపీ ఎస్సీ సెల్ నాయకులతో కలసి బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ గాని, జగన్‌మోహన్‌రెడ్డి గానీ రాష్ట్రానికి చాలా ప్రమాదకరమని ఈ సంఘటన మరోసారి రుజువు చేస్తుందన్నారు. విలేకరుల సమావేశంలో చిలకా చంద్రం, దుద్దుల మరియదాసు, గుడేటి ప్రకాశం, చిలకా శ్రీను, దద్దుల అక్కులు, చిలకా ఆదెయ్య తదితరులు పాల్గొన్నారు.

మాలధారులకు అన్నదానం

దుర్గి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): దుర్గిలోని వేణుగోపాలస్వామి కళ్యాణ మండపంలో మాల ధరించిన స్వాములకు అన్నదానం చేపట్టారు. బుధవారం అయ్యప్ప, భవాని, శివ, నాగమయ్య మాలలు ధరించిన స్వాములకు గ్రామ పెద్దల సహకారంతో అన్నదానం నిర్వహించారు. స్వాములు దీక్షలో ఉన్న 41 రోజులపాటు అన్నదానం చేయనున్నారు.

పేదల సొంతింటి కల నెరవేరేనా!

● అసంపూర్తిగా టిడ్కో గృహాలు
● లబ్ధిదారుల ఎదురుచూపు

మాచర్ల రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తమ సొంతింటి కల నెరవేరాలని పట్టణంలోని ఎంతో మంది పేద, మధ్య తరగతి ప్రజలు ఎదురుచూస్తున్నారు. దశాబ్ద కాలం కిందట పేదల సొంతింటి కల పేరుతో టీడీపీ ప్రభుత్వం పట్టణంలో టిడ్కో గృహాల నిర్మాణం చేపట్టింది. 60 శాతం పనులు కూడా పూర్తయ్యాయి. తదుపరి వైసీపీ అధికారంలోకి రాగానే టిడ్కో గృహాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. టిడ్కో గృహాలకు ఆద్యుడైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరలా అధికారంలోకి రావడంతో టిడ్కో గృహాల నిర్మాణాలు పూర్తవుతాయని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.


అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలు

మొదటి ఫేజ్‌లో 1056 గృహాల నిర్మాణం..

2014 సంవత్సరంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో పట్టణంలోని గొర్రెల మండి సమీపంలో 2500 గృహాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఫేజ్- 1 కింద 1056 టిడ్కో గృహాల నిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వం 60 శాతం పూర్తి చేసింది.

వైసీపీ హయాంలో..

2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టిడ్కో గృహాల నిర్మాణాలను జగన్ ప్రభుత్వం పక్కన పెట్టింది. గృహ నిర్మాణాలకు వినియోగించే ఇనుము, ఇసుక వంటివి వైసీపీ నేతలు అమ్ముకున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. గృహాల నిర్మాణాలు నిలిచిపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి.

కూటమి ప్రభుత్వంపై ఆశలు..

పేదల పక్షాన నిలిచే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో కూటమి అధికారంలోకి రావడంతో లబ్ధిదారుల ఆశలు చిగురిస్తున్నాయి. టిడ్కో గృహాలు పూర్తయ్యి చేతికొస్తాయనే ఆశతో ఎదురుచూస్తున్నారు.

త్వరలోనే పనులు ప్రారంభం



త్వరలోనే టిడ్కో గృహాల పనులు ప్రారంభమవుతాయి. ప్రభుత్వం ఇప్పటికే ఓ సంస్థకు ఈ పనులను అప్పజెప్పింది. త్వరలోనే అపార్ట్‌మెంట్‌ను పరిశీలించి పనులను ప్రారంభిస్తారు. పనులు పూర్తవగానే లబ్ధిదారులకు అందజేస్తాం.

- ధూళిపాళ్ల వేణుబాబు, మున్సిపల్ కమిషనర్

‘స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర’కి మాకు ఆహ్వానం లేకపోవడమేంటి..!

● మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్ల ఆగ్రహం

మాచర్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో ఇటీవల నిర్వహించిన స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమానికి పట్టణ ప్రథమ పౌరున్ని, కౌన్సిలర్లను ఆహ్వానించకపోగా రూ.10 లక్షలు ఖర్చయిందని కౌన్సిలర్ల సమావేశం అజెండాలో చేర్చడమేంటని మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబును కౌన్సిలర్లు నిలదీశారు. బుధవారం పట్టణంలోని పురపాలక సంఘ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ షేక్ మదార్‌సాహెబ్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో 29వ వార్డు కౌన్సిలర్ సుభానిసాహెబ్, 21వ వార్డు కౌన్సిలర్ ముదిశెట్టి శ్రీనివాసరావు, 1వ వార్డు కౌన్సిలర్ గట్ల అరుణకుమారి కమిషనర్ వేణుబాబుపై విరుచుకుపడ్డారు. ఏ లెక్కలో మీరు ఖర్చు రూ.10 లక్షలు అయిందని అజెండాలో పెట్టారని, కౌన్సిలర్లను, చైర్మన్‌ను పరిగణలోకి తీసుకోకుండా ఇష్టారాజ్యంగా ఖర్చు అజెండాలో పెట్టడంతోపాటు యాదవ బజారులో జరిగిన స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ట్యాంకు ఏర్పాటు చేసి ప్రతిపాదనలు పొంతన లేకుండా పొందుపరచడాన్ని తప్పుబట్టారు. దీనిపై కమిషనర్ వేణుబాబు స్పందిస్తూ స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో జరిగిన ప్రతి ఖర్చుకు బిల్లులు ఉన్నాయని, అత్యవసర, సమయాభావ పరిస్థితుల వల్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రోగ్రాం కావడంతో ఖర్చు చేయాల్సి వచ్చిందని సమాధానమిచ్చారు. చైర్మన్ మదార్‌సాహెబ్ స్పందిస్తూ ప్రొటోకాల్ సీఎంవో అధికారులు చూశారు.. కమిషనర్‌కు సంబంధం లేదని సమాధానమిచ్చారు. అజెండాలో పొందుపరిచిన 16 అంశాలు కౌన్సిల్ ఆమోదం పొందాయి. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్లు యర్రాకుల సిద్ధమ్మ సిద్ధయ్య యాదవ్, కలివెల జ్యోతి కిషోర్, డీఈ సుభాని తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ సమావేశం నిర్వహిస్తున్న మదార్‌సాహెబ్, మాట్లాడుతున్న 21వ వార్డు కౌన్సిలర్ శ్రీనివాసరావు


మంత్రి లోకేశ్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి దంపతులు

చంద్రబాబు, లోకేశ్‌లకు వివాహ ఆహ్వాన పత్రిక అందజేత

మాచర్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పెద్ద కుమారుడు జూలకంటి గౌతమ్‌రెడ్డి వివాహ మహోత్సవానికి హాజరుకావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకు వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. కుటుంబ సమేతంగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి బుధవారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి తరలివెళ్లి ఈ ఆహ్వాన పత్రికలను అందజేశారు. సీఎం చంద్రబాబుకు వివాహ ఆహ్వాన పత్రిక అందించిన వారిలో జూలకంటి సతీమణి శోభారాణి, కుమారులు నాగార్జునరెడ్డి, సాయి వివేకానందరెడ్డి, యువ నాయకులు జూలకంటి అక్కిరెడ్డి తదితరులు ఉన్నారు.

మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభం


పిడుగురాళ్లలో స్కూల్ గేమ్స్ పోటీలను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం కొత్త మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు


పిడుగురాళ్ల, అక్టో బరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జడ్పీ హైస్కూల్లో బుధవారం మండల స్థాయి ఆటల పోటీలను హెచ్‌ఎం కొత్త మల్లికార్జున రావు ప్రారంభించారు. మండలంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు వివిధ పోటీ ల్లో పాల్గొన్నారు. అండర్-14, 15 విభాగాల్లో బాలబాలికలకు జరిగిన క్రీడా పోటీల్లో మండలంలోని తుమ్మలచెరువు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీడీలు ఇమ్మానియేలు రాజు, డానియేలు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● దాచేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను ఎంఈవో పినాకపాణి, హెచ్‌ఎం సాంబ య్యలు ప్రారంభించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యం లో రెండు రోజుల పాటు పోటీలు జరగనున్నాయి.

● నకరికల్లు మండల స్థాయి ఆటల పోటీలు బుధవారం నకరికల్లులోని వంగా వెంకటరెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రారం భమయ్యాయి. ఈ పోటీలను హెచ్‌ఎం జాలాది శ్రీనివాస రావు ప్రారంభించారు. అండర్- 17, అండర్- 14 బాలబాలికల పోటీలను నకరి కల్లులో నిర్వహిస్తున్నట్టు సత్తెనపల్లి డిప్యూటీ డీఈవో, నకరికల్లు ఎంఈవో ఏసుబాబు తెలిపారు. ఈ పోటీల్లో 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. గెలుపొందిన బాల బాలి కలు డివిజన్ స్థాయిలో జరిగే ఆటల పోటీల్లో పాల్గొంటారని మండల కో-ఆర్డినేటర్, ఫిజి కల్ డైరెక్టర్ జీ ఝాన్సీరాణి తెలిపారు.

● క్రోసూరు : క్రోసూరు హైస్కూల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడా పోటీలను ఎంఈవో- 1 జీ.కృష్ణ ప్రారంభించారు. ఎంఈవో-2 గణేష్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల దేహదారుఢ్యానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాబూరావు పాల్గొన్నారు. క్రీడలను నాగవరం హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ కే.రామయ్య, బయ్యవరం హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ కాసు ఆరోగ్యమ్మ, కేజీబీవీ ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మి నిర్వహించారు.

టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా సాంబయ్య


ఏండూరి సాంబయ్య

మాచవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మాచవరం మండలం ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పిల్లుట్ల గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ఏండూరి సాంబయ్య నియమితులయ్యారు. ఈ మేరకు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఏండూరి సాంబయ్యను ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సాంబయ్య ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు, మండల నాయకులకు, పిల్లుట్ల గ్రామ నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ పాస్టర్ ప్రభుదాస్‌కు సాహితి భూషణ్ అవార్డు

రెంటచింతల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలకు చెందిన జీసస్ క్రైస్ట్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు డాక్టర్ డి.ప్రభుదాస్ సాహితీ భూషణ్ అవార్డును ప్రశంసా పత్రాన్ని అందుకున్నట్లు లూథరన్ చర్చిపాస్టర్ కె.సువర్ణరాజు చెప్పారు. బుధవారం ఏర్పాటు చేసి న విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రముఖ సాహితీవేత్త గుర్రం జాషువా స్మారక కళాపరిషత్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రవీంద్రభారతి మినీహాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆచార్య కొలకలూరి ఇనాక్ చేతుల మీదుగా ఈ అవార్డును ప్రదానం చేశారని ఆయన పేర్కొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

● ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

మాచర్ల రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏడేళ్ల క్రితం వేతనాలు పెరిగాయని, మరలా ఇంత వరకు పెరగలేదని అన్నారు. నవంబరు 14, 15 తేదీల్లో ఏపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభ ఒంగోలులో జరగనుందని, కార్మికుల సమస్యల పరిష్కారంపై ఆందోళన నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా నేత ఆంజనేయులు నాయక్, ఇసాక్, జీవరత్నం, బత్తుల కోటేశ్వరరావు, పెద్ద వెంకయ్య, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

డివిజనల్ స్థాయికి జడ్పీ విద్యార్థుల ఎంపిక

పిడుగురాళ్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ పాఠశాలలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన అండర్-14, 17 బాల బాలికల విభాగంలో తుమ్మలచెరువు జడ్పీ పాఠశాల విద్యార్థులు డివిజనల్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి తెలిపారు. అండర్-17లో బి.స్వరూప, లక్ష్మీప్రసన్న, ఎం.నందినిరెడ్డి, బి.బెస్సీ, అండర్-14లో ఎస్‌కే నాగుల్‌మీరాలు ఎంపిక కావడంపై పాఠశాల సిబ్బంది హైమారావు, కృష్ణప్రసాద్, చల్లగుండ్ల శ్రీనివాసరావు, సాంబశివరావు, నాగరాజు, బసవయ్య, రాధారమణి, పద్మ, శ్రీవాణి, పీడీ జ్యోతిరత్నం, ఎస్‌ఎంసీ చైర్మన్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

దమ్మాలపాడు విద్యార్థుల ప్రతిభ

ముప్పాళ్ళ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదల హైస్కూల్లో జరిగిన మండలస్థాయి ఆటలపోటీల్లో దమ్మాలపాడు విద్యార్థులు ప్రతిభ కనబరిచి నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం సిద్ధయ్య, పీడీ సుబ్రమణ్యంలు బుదవా రం తెలిపారు. అండర్-14చెస్, అండర్-14, 17 కబడ్డీ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కన బరచి నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని పలువురు అభినందించారు.

ఈ పంట నమోదుపై అవగాహన

పెదకూరపాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : రైతు సేవా కేంద్ర సిబ్బందికి ఈ పంట నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని ఏవో డీ కృష్ణయ్య అవగాహన కల్పించారు. పెద కూరపాడులో బుధవారం రైతు సేవాకేంద్రం పరిధిలోని పంట సాగు చేయు, సాగు చేయ ని అన్ని భూ కమతాలను ఈ పంట యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. రైతు సంక్షేమ పథకాలన్నింటికి ఈ పంటలే ప్రామాణికంగా ఉంటుందని వివరించారు.

నేడు పెదకూరపాడు రైల్వేస్టేషన్‌లో భారీ మాక్‌డ్రిల్

గుంటూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు రైల్వేస్టేషన్‌లో గురువారం భారీ మాక్‌డ్రిల్ జరగనుంది. ఇందుకోసం రైల్వే శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

కొత్తపల్లి రోడ్డుకు మోక్షం

విజయపురిసౌత్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నుంచి విజయపురిసౌత్ రహదారి విస్తరణ పనులకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ నిధులు మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తపల్లి జంక్షన్ నుంచి విజయపురిసౌత్ వరకు దాదాపు 11 కి.మీ.లకు పైగా ఉండే ఈ రోడ్డుకు ప్రభుత్వం రూ.5 కోట్లు కేటాయించింది. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

● రెంటచింతల : మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన మూఢావత్ చిన హనుమంతునాయక్ ఈనెల 4 నుంచి అదృశ్యమైనట్లు తల్లి ద్వాలీబాయి ఫిర్యాదు చేసింది. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగార్జున చెప్పారు.

శివాలయంలో చోరీ

రెంటచింతలలోని శివాలయంలో మంగళవారం రాత్రి దొంగలు ప్రవేశించి హుండీలోని నగదును దోచుకెళ్లినట్లు ఎండోమెంట్ ఈవో గాదే రామిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 18న హుండీ లెక్కింపు చేయనున్న తరుణంలో దొంగతనం జరిగింది.

బుల్లెట్ అపహరణ

రెంటచింతలలోని రామాలయం సెంటర్లో తెల్లరంగుతో ఉన్న బుల్లెట్ మంగళవారం రాత్రి అపహరణకు గురైనట్లు బాధితుడు మనిగండ్ల మల్లికార్జునరావు బుధవారం పోలీ సు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తును చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు.

గుండెపోటుతో ఆర్ఎంపీ మృతి

కారంపూడి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాదెవారిపల్లెకి చెందిన సీనియర్ ఆర్ఎంపీ ఆంజనేయులు బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. మాచవరం మండలం కొత్తపాలెంకు చెందిన ఆంజనేయులు ఎన్నో ఏళ్లగా గాదెవారిపల్లెలో ఆర్ఎంపీగా సేవలు అందిస్తున్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

రాజుపాలెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని రెడ్డిగూడెం ఉర్దూ పాఠశాల విద్యార్థులకు ఫ్లోరోసిస్‌పై జిల్లా కన్సల్టెంట్ ఎన్‌సీడీ డాక్టర్ గిరిధర్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన, వైద్యపరీక్షలు జరిగాయి. బుధవారం పాఠశాలలో డాక్టర్ గిరిధర్‌కుమార్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జోత్స్న, ఉపాధ్యాయులు, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

భూగర్భ జలాల వృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి : జేసీ


శ్రీరాంపురంతండాలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జేసీ సూరజ్‌గనోరే

వెల్దుర్తి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాల వృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే సూచించారు. బుధవారం మండలంలోని రచ్చమలపాడు, శ్రీరాంపురం తండా గ్రామాలతోపాటు పలు గ్రామాల్లో ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. శ్రీరాంపురంతండాలోని పాఠశాలను సందర్శించి నీటి వసతులు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి అందుతున్న పుస్తకాలు, బ్యాగులను పరిశీలించారు. పాఠశాలలో త్వరలోనే డీఎస్సీ ద్వారా ఎన్నికైన ఉపాధ్యాయులతో భర్తీ చేస్తామన్నారు. గ్రామస్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సమీపంలోని అటవీ శాఖ, రెవెన్యూ భూములను ఆయన పరిశీలించారు. అనంతరం వెల్దుర్తిలో ఆయన అధికారులతో సమావేశమయ్యారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి భూగర్భ జలాల వృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఆరా తీశారు. మండలంలో సోలార్ ప్రాజెక్టుకు 70 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించారని, త్వరలోనే ప్రాజెక్ట్ పనులు ప్రారంభమవుతాయన్నారు. జేసీ సూరజ్ గనోరే వెంట గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, తహసీల్దార్ రాజశేఖర్ నాయక్, ఎంపీడీవో ప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాలునాయక్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

న్యూచిట్యాల తండా నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి

● నేషనల్ ఎస్టీ కమిషనర్ హుస్సేన్ నాయక్‌కు వినతి


నేషనల్ ఎస్టీ కమిషనర్ హుస్సేన్ నాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న న్యూ చిట్యాల తండా నిర్వాసితులు

బెల్లంకొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యూచిట్యాల తండా సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని నేషనల్ ఎస్టీ కమిషనర్ హుస్సేన్‌నాయక్‌కు తండా నిర్వాసితులు బుధవారం హైదరాబాద్‌లోని ఎస్టీ కమిషన్ కార్యాలయంలో హుస్సేన్‌నాయక్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా న్యూ చిట్యాల తండా మాజీ సర్పంచ్ హనుమంతరావునాయక్, మాజీ జడ్పీటీసీ తులసీనాయక్, ఎస్ ప్రసాదునాయక్, మరి కొంతమంది ముంపు బాధితులు హుస్సేన్‌నాయక్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని న్యూ చిట్యాల తండా ఏర్పడి సుమారు 15 సంవత్సరాలు కావస్తున్నా ఇంత వరకు శ్మశాన స్థలాన్ని కేటాయించలేదని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. 2010 సంవత్సరంలో పులిచింతల ముంపు గ్రామాలకు కరెంటు, రోడ్డు మార్గం ప్రభుత్వం నిలిపివేసిందని, అందులో కొన్ని కుటుంబాలు ప్రభుత్వం ఇచ్చిన పునరావాస కేంద్రాలకు వెళ్లగా మరికొన్ని కుటుంబాలు పులిచింతల ప్రాజెక్టు దూరంగా నీరు రాని చోట లక్ష్మీనరసింహా స్వామి దేవస్థానానికి సమీపంలో రెండు వందల కుటుంబాలకు పైగా నివాసం ఉంటున్నారన్నారు. కాని ఆ కుటుంబాలకు మౌళిక సౌకర్యాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ముంపు బాధితులు కమిషనర్‌ను కోరారు. స్పందించిన హుస్సేన్‌నాయక్ ఫిబ్రవరిలో రెండు వందల కుటుంబాల వద్దకు వచ్చి పరిశీలిస్తానని బాధితులకు హామీ ఇచ్చారు. కమిషన్‌ను కలసిన వారిలో ఎంపీటీసీ నరసింహా నాయక్, చందరరావు నాయక్, బాణావత్ బాలాజీ నాయక్, బాలునాయక్, ప్రసాదు నాయక్ ఉన్నారు.

దళితుల ద్రోహి జగన్

● టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసు

దుర్గి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): దళితుల ద్రోహి జగన్ అని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల దాసు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో దళితులకు జగన్‌మోహన్‌రెడ్డి చేసిందేమీ లేదన్నారు. కూటమి ప్రభుత్వం దళితుల అభ్యున్నతికి చేస్తున్న కృషిని ఓర్వలేక తాడేపల్లి ప్యాలెస్ పెద్దల నుంచి వచ్చిన సూచనల మేరకు చిత్తూరు జిల్లా, వెదురుకుప్పం మండలం, దేవలంపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వైసీపీ నేతలు నిప్పుపెట్టి రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. దళిత సంఘాలు, ప్రజా సంఘాలు వైసీపీ కుట్రలపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

టీడీపీ నేత నాగోతు శౌరయ్యకు మాతృవియోగం


నకరికల్లు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగోతు శౌరయ్య మాతృమూర్తి నాగోతు చిన్నమ్మ బుధవారం మృతి చెందారు. శౌరయ్య స్వగ్రామమైన తురకపాలెం గ్రామంలో చిన్నమ్మ భౌతికకాయాన్ని ఉంచారు. గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు శౌరయ్య తెలిపారు. చిన్నమ్మ మృతికి పలువురు టీడీపీ నేతలు తమ సంతాపాన్ని, శౌరయ్యకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. శౌరయ్యను నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ బుధవారం పరామర్శించారు. చిన్నమ్మ భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రీకృష్ణదేవరాయలు, శ్రీధర్ నివాళులర్పించారు. వారితో పాటు సర్పంచ్ నాగోతు దాసయ్య ఉన్నారు.


శౌరయ్యను పరామర్శిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, శ్రీధర్ (అంతరచిత్రంలో) చిన్నమ్మ (ఫైల్)

బ్లాక్ బర్లీ పొగాకు సాగును నిషేధించిన ప్రభుత్వం

నకరికల్లు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో బ్లాక్ బర్లీ పొగాకు సాగును ప్రభుత్వం పూర్తిగా నిషేధించిందని ఏవో కే దేవదాసు తెలిపారు. ఈ మేరకు ప్రభు త్వం జీవోను విడుదల చేసినట్టు తెలిపారు. జిల్లాల, డివిజన్ల వారీగా, మండల స్థాయిల్లో టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. చాగల్లులో నిర్వహించిన సమావేశంలో ఏవో దేవదాసు మాట్లాడుతూ మండలంలో తహసీల్దార్ చైర్మన్‌గా వ్యవహరిస్తారని, మండల వ్యవసాయ అధికారి కన్వీనర్‌గా ఎస్ఐ, మెడికల్ ఆఫీసర్ ఒక అభ్యుదయ రైతు సభ్యులుగా ఉంటారని, ఈ మేరకు కమిటీని నియమించినట్టు తెలిపారు. చాగల్లులో జరిగిన అవగాహన కార్యక్రమంలో తహసీల్దార్ కే పుల్లారావు, డీటీ కొండారెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సిద్దయ్య, పంచాయతీ సెక్రటరీ తన్నీరు మల్లికార్జునరావు, అభ్యుదయ రైతు వెంకటరావు, వీఆర్‌వో పీరా, ఎంపీవో కే.వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

అధిక వర్షాలకు పత్తి పంటలో జాగ్రత్తలు పాటించాలి : ఏడీఏ


పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు

పిడుగురాళ్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తి పంటకు నష్టం జరుగకుండా రైతులు జాగ్రత్తలు పాటిస్తే దిగుబడి తగ్గదని వ్యవసాయ అధికారులు తెలిపారు. బుధవారం వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులు పలు గ్రామాల్లో పర్యటించి రైతులు సాగు చేస్తున్న పంటలు వర్షాలకు దెబ్బ తినకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ తక్షణమే పంట పొలాల్లో నిలిచివున్న నీటిని తొలగించాలని, నేల తడిగా వున్నప్పుడు యంత్రాలను వాడకూడదన్నారు. ఏవో సంధ్యారాణి, ఉద్యాన శాఖ అధికారి అంజలిబాయి పందిటివారిపాలెం సమీపంలో మిరప పంటను పరిశీలించారు.

వర్షమొస్తే.. క్రయవిక్రయాలు బంద్

● మిర్చి యార్డులో నిలిచిపోతున్న వర్షపు నీరు



మిర్చి యార్డులో దిగుమతి దుకాణాల చుట్టూ వర్షపు నీరు

గుంటూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వర్షం కురిసిన ప్రతిసారి మిర్చి యార్డులో వరదనీరు భారీగా చేరి నిలబడిపోతోంది. దీంతో కమీషన్ ఏజెంట్లు దుకాణాల వద్దకు వెళ్లలేని పరిస్థితి తలెత్తుతోంది. అలానే మిర్చి టిక్కీలు కూడా తడిసిపోయి రైతుకు నష్టం కలుగుతోంది. వర్షం నీరు నిలబడిన రోజున లావాదేవీలు ఆగిపోతున్నాయి. దీనంతటికి కారణం యార్డులో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడమే. ఏటా రూ. 100 కోట్లకు పైగా ఆదాయాన్ని కూడబెట్టుకునే మిర్చి యార్డులో డ్రెయిన్లు చిన్నవిగా మారడంతో వర్షపు నీరు బయటకు ప్రవహించకుండా వేలం కేంద్రాల చుట్టూత చేరుతోంది. రాబోయే సీజన్‌ని దృష్టిలో పెట్టుకుని సత్వరమే డ్రెయినేజీ వ్యవస్థని మెరుగుపరచాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది.



ప్రకృతి వ్యవసాయం ప్రశంసనీయం

● ముగిసిన బ్రెజిల్ బృందం రాష్ట్ర పర్యటన

కొల్లిపర, గుంటూరు సిటీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతు సాధికార సంస్థ అమలు చేస్తున్న 'ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవ సాయం' పనితీరు ప్రశంసనీయం అని బ్రెజిల్ బృందం పేర్కొంది. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకునేందుకు వారం రోజుల పాటు పర్యటించిన బ్రెజిల్, శ్రీలంక, యుఏఈ దేశాలకు చెందిన ప్రతినిధి బృందం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించింది. ఈ పర్యటనలో చివరి రోజు బుధవారం గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నూతక్కి గ్రామం, కొల్లిపర మండలం అత్తోట గ్రామాల్లో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. తొలుత నూతక్కి గ్రామంలో రైతు కల్లం శ్రీనివాసరెడ్డి పసుపు, అరటి పంటల ఏ -గ్రేడ్ మోడల్‌ను బ్రెజిల్ బృందం సందర్శిం చింది. రైతు అనుసరిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా తమకు విలువైన పరిజ్ఞానం లభించిందని బృందం తెలిపింది. తక్కువ పెట్టుబడి, శ్రమతో అధిక దిగుబడి సాధించే తత్వాన్ని మెచ్చుకుంది. రసాయన, ప్రకృ తి వ్యవసాయం పద్ధతుల్లో సాగు చేసిన పసుపు పంటలను బృంద సభ్యులు పోల్చి పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం క్షేత్రం జీవంతో నిండినట్లు కనిపించగా, రసాయన క్షేత్రాల్లో పంట ఆరోగ్యకరంగా లేనట్లు గమనిం చారు. అనంతరం బృందం అత్తోట గ్రామానికి వెళ్లి ఎస్. రోశయ్య అనే రైతులు సాగు చేస్తున్న అయిదు అంచెల ప్రకృతి వ్యవసాయ మోడల్‌ను సందర్శించారు. ఈ క్షేత్రంలో వరి పంట బ్లాక్‌లో ద్రవ జీవామృతం ఉప యోగించిన విధానం తెలుసుకున్నారు. రైతు సాధికార సంస్థ చీఫ్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ అధికారి లక్ష్మ నాయక్ రైతులు సాగు చేసిన మోడల్స్ గురుంచి వివరించారు. చివరిగా భూమి భారతి శిక్షణ కేంద్రంలో నేర్చుకున్న ఘన జీవామృతాన్ని బృంద సభ్యులు స్వయంగా తయారు చేశారు. ఆర్‌వై ఎస్ఎస్ సీనియర్ అధికారి వాణిశ్రీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కొల్లిపర మండలం అత్తోట గ్రామంలో బ్రెజిల్ బృందం

పక్షం రోజులకోసారి ఎంపీడీఓల పనితీరుపై సమీక్ష

● జడ్పీ సీఈఓ జ్యోతి బసు

గుంటూరు సిటీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పక్షం రోజులకు ఒకసారి ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎంపీడీఓల పనితీరు పై టూర్ డైరీ ఆధా రంగా సమీక్ష నిర్వహిస్తామని జడ్పీ సీఈఓ వీర్ల జ్యోతి బసు తెలిపారు. బుధవారం గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో స్థానిక సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు - క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ అనే అంశంపై ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జడ్పీ సీఈఓ మాట్లాడుతూ ఎంపీడీఓ ల టూర్ డైరీ గతంలో మాదిరిగా యాంత్రికంగా కాకుండా ప్రతి అడుగూ గ్రామీణ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు - క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ సాధించే దిశగా ఉండాలన్నారు. చెత్త సేకరణ అంశంలో గుంటూరు జిల్లా రాష్ట్రంలోనే నంబరు వన్ స్థానం లో ఉందని సీఈఓ వెల్లడించారు. అయినా.. ప్రజల సంతృప్తి స్థాయిని 95 శాతానికి చేరుకునేలా చేయాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛ రథం పర్యవేక్షణ బాధ్యత పూర్తిగా ఎంపీడీఓలదే అని ఆయన స్పష్టం చేశారు. జిల్లా పంచాయతీ అధికారి బీవీ నాగ సాయికుమార్ మాట్లాడుతూ చేసిన పనిని యాప్‌లో నమోదు చేయాలన్నారు. పారిశుధ్యం మెరుగు పరచకపోతే అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు.

ఎంపీడీఓలపై సీఈఓ ఆగ్రహం

సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి సీరియస్‌గా మాట్లాడు తుండగా.. కొందరు ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు ముచ్చట్లతో మునిగిపోవడాన్ని సీఈఓ గమనించారు. ప్రభుత్వం ఎంతో మంచి లక్ష్యంతో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేస్తే కొందరు ముచ్చట్లు పెట్టుకోవడం, మరికొందరు సెల్ ఫోన్లలో మునిగిపోవడం ఏంటని నిలదీశారు. ఇలా ఇష్టానుసారం ప్రవర్తించే వారిపై కఠినంగా ఉంటామని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ జ్యోతి బసు, డీపీఓ నాగసాయి కుమార్

నివేదికలు సరైన సమయంలో పంపని అధికారులకు కూడా సీఈఓ జ్యోతి బసు హెచ్చరికలు జారీ చేశారు. నిర్లక్ష్యంగా ఉంటే పేపర్‌పై పెన్ను పెట్టాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

ఏఓల ప్రమోషన్ ఫైల్‌కు మోక్షం

● ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆదేశాలతో జడ్పీ సీఈఓ చర్యలు

● నేడు ఉత్తర్వులు వెలువడే అవకాశం


గుంటూరు సిటీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆదేశాలతో ఐదు నెలలుగా నిలిచిన ఏఓల ప్రమోషన్ ఫైల్‌లో కదలిక వచ్చింది. జడ్పీ సీఈఓ వి.జ్యోతి బసు ప్రమో షన్‌ల వ్యవహారంపై చర్చించేందుకు బుధవారం ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఆయా సెక్షన్‌ల ఏఓలు శామ్యూల్ పాల్, రాజా రత్నం, పూర్ణ చంద్రారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ కూచిపూడి మోహన్‌రావు పాల్గొన్నారు. 12 ఖాళీల్లో 11 పోస్టులను ప్రమోషన్ ప్రక్రియ ద్వారా భర్తీ చేయాలని సమావేశంలో నిర్ణయించారు. 30 మంది సీనియర్ అసిస్టెంట్ లతో ప్యానల్ రూపొందించి.. వారిలో ప్రస్తుతం అర్హత కలిగిన 11 మందికి ప్రమోషన్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. దానికి సంబంధించిన ఫైల్‌ను వెంటనే సిద్ధం చేసి తనకు పంపాలని సీఈఓ ఏ సెక్షన్ అధికారులను ఆదేశించారు. సీఈఓ పరిశీలన అనంతరం ఈ ఫైల్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా వద్దకు వెళ్లనుంది. ఆమె అనుమతి పొందిన తర్వాత ప్రమోషన్ ఉత్తర్వులు వెలువడనున్నాయి. గురువారం సాయంత్రానికి ప్రమోషన్ ఫైల్‌కు మోక్షం లభించనుంది.

రేపు రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం 8వ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు లక్ష్మీనారాయణ, రమణరావు, సత్యనారాయణ బుధవారం తెలిపారు. స్థానిక లక్ష్మీపురంలోని అసోసియేషన్ కార్యాలయంలో పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి, వివరాలను వెల్లడించారు. అండర్-25 నుంచి అన్ని విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. క్రీడా కారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆస్తిపన్ను.. ఆన్‌లైన్ చెల్లింపుల్లో వెనకడుగు!

అవగాహన కల్పనలో చొరవ చూపని పంచాయతీ కార్యదర్శులు



పిడుగురాళ్ల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలో ఇంటి పన్ను చెల్లింపునకు ప్రభుత్వం కొత్త విధానం అమలులోకి తెచ్చింది. కానీ, చెల్లింపుదారులకు సరైన అవగాహన కల్పించకపోవడంతో గ్రామ పంచాయతీలు వసూళ్లలో వెనుకబడి పోతున్నాయి. ఇప్పటిదాకా గ్రామాల్లో ఆస్తి పన్ను చెల్లించాలంటే పంచాయతీ కార్యాలయానికి వెళ్లి సంబంధిత కార్యదర్శికి నగదు చెల్లించి, రసీదు తీసుకునేవారు. ఆ విధంగా చెల్లించిన రసీదులు ఎంతోకాలం భద్రపరచలేక పన్నుదా రులు ఇబ్బంది పడేశారు. రసీదులు కనిపించకపోతే.. మొత్తం పన్ను చెల్లించాలంటూ.. పంచాయతీ కార్యదర్శులు గృహ యజమానుల ముక్కు పిండి వసూలు చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. పన్ను వసూళ్లలో సిబ్బంది కూడా చేతివాటం ప్రదర్శించేవారు. ఖజానాకు నగదు జమచేయకుండా సొంతానికి వాడుకునేవారు. మరికొందరు కార్యదర్శులు నకిలీ రసీదులు గృహ యజమానులకు అందించి ఆ నగదును సొంతానికి వాడుకున్న సందర్భాలూ ఉన్నాయి. ఇలాంటి అవకత వకలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఆస్తి పన్నుకు డిజిటల్ నంబరును కేటాయించింది. యూపీఐల ద్వారా లేక ఆన్‌లైన్‌లో డిజిటల్ నెంబరు ఆధారంగా.. ఆస్తి పన్ను చెల్లించే అవకాశం కల్పించింది. స్వర్ణ పంచాయత్ ఏపీసీఎఫ్ఎస్ఎస్ ఇన్ లాగిన్ హౌస్‌టాక్స్ పేమెంట్ అనే వెబ్ సైట్‌లో ఆస్తి పన్నును చెల్లించుకునే విధంగా పోర్టల్‌ను రూపొందించారు. ఈ పోర్టల్ ఓపెన్ అయ్యాక సంవత్సరం, జిల్లా, మండలం, పంచాయతీ ఎంపిక చేసుకొని ఆస్తి అసెస్‌మెంట్ నంబర్, యజమాని పేరు, డోరు నంబరు ద్వారా ఏదో ఒకటి ఎంపిక చేసుకొని ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా పన్నును చెల్లించుకునే విధానాన్ని పంచాయతీరాజ్ శాఖ అందుబాటులోకి తెచ్చింది. పన్ను చెల్లించాక రసీదు పొందే విధానం కూడా ఉంది.

తగ్గిన అవగాహన..

గ్రామ పంచాయతీల్లో ఆస్తిపన్ను వసూళ్లలో.. పంచాయతీరాజ్‌శాఖ తీసుకొచ్చిన నగదు రహిత లావాదేవీల విధానంపై అవగాహన కల్పించడంలో పంచాయతీ కార్యదర్శులు వెనుకబడి ఉన్నారు. పంచాయతీ కార్యదర్శులు కూడా తమ వద్దకు వచ్చిన వారికే ఆన్‌లైన్ చెల్లింపు చేసి రసీదు ఇస్తున్నారు. కార్యా లయాలకు రాకుండా నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పిస్తే పంచాయతీలకు ఆదాయంతో పాటు మార్చి నాటికి ఆస్తిపన్ను చెల్లింపులు త్వరితగ తిన వసూలవుతాయనే ఆలోచనలో వెనుకబడ్డారు.

అదృష్టం బాగుండి బయటపడ్డారు..లేకుంటే!



బస్సుపై పడ్డ విద్యుత్ స్తంభం

అమరావతి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అదృష్టం బాగుండి 35 మంది ప్రయాణికులు భారీ ప్రమాదం నుంచే బయట పడ్డారు. గుంటూరు నుంచి ప్రయాణికులతో అమరావతికి ఏపీ 39యూజడ్ 5677 నంబరు గల ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు వస్తోంది. ఈ క్రమంలో ఎండ్రాయి గ్రామ సమీపంలో రోడ్డు వెంబడి 33 కెవీ విద్యుత్ స్తంభం కూలి ఒక్కసారిగా బస్సుపై పడింది. స్తంభం పడే సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో బస్సులో ఉన్న ప్రయాణికులకు భారీ ప్రమాదం తప్పింది. ముందుగా చింతచెట్టు కూలి విద్యుత్ తీగలమీద పడటంతో ఆ ధాటికి స్తంభం కూలింది. చెట్టు తీగలపై పడగానే విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అయి కరెంటు పోయింది. దీంతో బస్సుకు విద్యుత్ సరఫరా కాలేదు. స్తంభం పడగానే.. బస్సులో ఉన్న ప్రయాణికులు భయాందోళనతో కిందకి దిగిపోయారు. సమాచారం తెలుసుకున్న పోలీసు, విద్యుత్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని.. బస్సుపై పడ్డ స్తంభాన్ని తొలగించారు.

సెపక్ తక్రా జిల్లా జట్ల ఎంపిక

సత్తెనపల్లి రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నంది గామ జడ్పీ హైస్కూల్లో బుధవారం పల్నాడు జిల్లా సెపక్ తక్రా జూని యర్ బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. ఈ ఎంపికలకు జిల్లా నలు మూలల నుంచి క్రీడాకారులు పాల్గొనగా వారి ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసినట్టు కార్యదర్శి పీ శివరామకృష్ణ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 11, 12 తేదీల్లో చీరాలలో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ సెపక్ తక్రా చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఎంపికల ప్రక్రియలో వ్యాయామ ఉపాధ్యాయులు గండు సాంబశివరావు, కే కిరణ్ కుమార్, అనీల్ దత్త నాయక్, కోచ్‌లు చిరంజీవి, రవి, శివలు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల కేసుల దర్యాప్తు మెరుగుపరచాలి : ఎస్పీ

గుంటూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గంజాయి ఇతర మాదకద్రవ్యాల కేసుల్లో చట్టపరమైన నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. నిందితులకు శిక్షలు పడేవిధంగా కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని, సీజ్ చేసిన మాదకద్రవ్యాల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని ఎస్పీ సూచించారు. గంజాయి కేసుల్లో న్యాయస్థానాల్లో నిందితులకు శిక్షలు విధించేందుకు, దర్యాప్తు అధికారులు స్పష్టమైన సాక్ష్యాధారాలు సమర్పించాలనే దిశగా దృష్టి సారించాలని సూచించారు. ఈ మేరకు బుధవారం జిల్లా ఈగల్ ఐజీ రవికృష్ణ, ఎస్పీ ఆదేశాల మేరకు, జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో 'ఈగల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' లో భాగంగా జిల్లా శిక్షణ కేంద్రం ఈగల్ విభాగం ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌ల రైటర్లు, ఈగల్ విభాగ సిబ్బందికి ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాదకద్రవ్యాల నియం త్రణ చట్టం ప్రకారం గంజాయి, ఇతర మాదకద్రవ్యాల సీజ్, స్టోరేజ్, శాంపిలింగ్, డిస్పోజల్ వంటి దశల్లో పాటించ వలసిన చట్టపరమైన విధానాలపై సవివరంగా అవగాహన కల్పించారు.

విద్యార్థుల ఉత్తీర్ణతే ఉపాధ్యాయుల విజయం

● జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా

వినుకొండ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): తమ విద్యార్థుల ఉత్తీర్ణతే ఉపాధ్యాయుల విజయానికి కొలమానమని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. వినుకొండ మండలంలోని వివేకానంద డీఎడ్ కాలేజీలో మెగా డీఎస్సీ - 2025లో ఎంపికైన నూతన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో బుధవారం కలెక్టర్ పాల్గొన్నారు. నూతన ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే పిల్లల నేపథ్యాన్ని గుర్తించి పాఠాలు బోధిం చాల్సిన అవసరం ఉంటుందన్నారు. ఇంటి పనుల్లో తల్లిదండ్రులకు సాయం చేస్తూ చదువుకునే పేద పిల్లలకు.. కార్పొరేట్ స్కూల్స్‌లోని పిల్లలకు తేడాలుంటాయన్నారు. విద్యార్థులను ప్రతిభ ఆధారంగా తరగతులుగా విభ జించి.. అందరినీ ఉత్తీర్ణులను చేయాలన్నారు.

నరసరావుపేట శిక్షణ కేంద్రం డీఈఓ తనిఖీ

గుంటూరు(విద్య), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నరసరావు పేట వాగ్దేవి జూనియర్ కాలేజీలోని రామన్ భవన్‌లో జరుగుతున్న నూతన ఉపా ధ్యాయుల శిక్షణ తరగతులను పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ బుధవారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయులందరూ మారు తున్న కాలానికి అనుగుణంగా విద్యాబోధన చేయాలని సూచించారు. ఇన్‌చార్జిలు ఎండీ ఖాసీం, గోవిందరాజులు, వెంకటరావు, సుధా రాణి, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

ఉపాధిలో బోగస్‌కు చెక్

జాబ్ కార్డులకు ఈకేవైసీ

ముఖ ఆధారిత హాజరుతో..అర్హులకు న్యాయం

సత్తెనపల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో బోగస్‌ల ఏరివేతపై ప్రభుత్వం దృష్టి సారించింది. అనర్హుల జాబ్ కార్డులను తీసి వేయడంతో పాటు దొంగ మస్టర్లకు చెక్ పెట్టాలన్న ప్రధాన లక్ష్యంతో ముందుకు వెళ్తోంది. కార్డులను ఈకేవైసీ చేయాలని ఆదేశించడంతో.. డ్వామా అధికారులు సత్తెనపల్లి సబ్ డివిజన్‌లో ఈ ప్రక్రి యలో నిమగ్నమయ్యారు. ఏటా నిర్వహిస్తున్న సామాజిక తనిఖీల్లో బోగస్ మస్టర్ల మాయా జాలం వెలుగు చూస్తోంది. క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న కూలీలకు, వాస్తవంగా హాజరవుతున్న సంఖ్యకు పొంతన ఉండడం లేదు. పలు చోట్ల బోగస్ హాజరును నమోదు చేస్తున్నారు. అటు వంటి వారి పేర్లతో హాజరు వేసి నిధులు దిగ మింగుతున్నారు. ఇలాంటి అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఈకేవైసీ ప్రక్రియను చేప ట్టింది. అలాగే ముఖ హాజరు అమలు చేయాలని నిర్ణయించింది. దీని వల్ల పథకంలో యంత్రాల వినియోగంతో పాటు పని ప్రదేశాల మార్పు, దొంగ ఫొటోలు, ఒకరికి బదులు మరొకరు పనులకు రావడం, కూలీల సంఖ్యను అధికంగా చూపటం వంటి వాటికి బ్రేక్ పడుతుందని అధికారులు భావిస్తున్నారు. దీంతోపాటు నకిలీ జాబ్ కార్డులు వెలుగు చూసే అవకాశం ఉంది.



తగ్గనున్న మెటీరియల్ కోటా నిధులు

ఉపాధి హామీ పథకం ద్వారా చేసే మొత్తం పనుల అంచనాలో 60 శాతం కూలీలు చేయాల్సి ఉంది. మిగతా 40 శాతం నిధులను కేంద్రం మెటీరియల్ కోటా కింద ఇస్తుంది. కూలీలు చేసిన పని ప్రకారమే మెటీరియల్ కాంపొండెంట్ నిధులు వస్తాయి. కూలీల సంఖ్యను పెంచాలని అధికారుల పై ఒత్తిడి ఉండటంతో ఇప్పటి వరకు ఏదో విధంగా కూలీల నమోదు అధికంగా చూపుతున్నారు. వేలి ముద్రలు, ముఖ ఆధారిత డిజిటలైజేషన్ కార్యక్రమం ద్వారా బోగస్ కూలీల సంఖ్య తగ్గి పోనుంది. దీంతో మెటీరియల్ కాంపొండ్ నిధులు కూడా తగ్గి పోతాయని పలువురు అంటున్నారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీ వివరాలను ఉపాధి హామీ పథకం సిబ్బంది గ్రామాల్లో నమోదు చేస్తున్నారు. కూలీల వేలి ముద్రలు, ఐరిష్, ముఖం డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీని వల్ల నిజమైన కూలీలకు న్యాయం జరుగుతుంది. చేసిన పనిని బట్టి కూలీలకు అధిక వేతనం కూడా లభిస్తుంది.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఆవులు, గేదెలను బహిరంగంగా వదిలేస్తే జరిమానా

నరసరావుపేట లీగల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బహిరంగంగా ఆవులు, గేదెలను వదిలివేయడం నేరమని ఆ విధంగా చేసినవారికి భారీగా జరిమానా విధిస్తామని నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించి ఆవులు, గేదెలను రోడ్లపైకి వదిలేస్తే యజమానులకు ముందస్తు నోటీసులు లేకుండానే సదరు పశువులను గోశాలకు తరలించడం జరుగుతుందన్నారు. దీనిని గమనించి పశువుల యజమానులు పట్టణ పరిశుభ్రతకు స్వచ్ఛ నరసరావుపేటకు సహకరించాలని కోరారు.

పట్టణ సీఐ ప్రభాకర్ బాధ్యతల స్వీకారం



వినుకొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ సీఐగా ప్రభాకర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ బాధ్యతలు నిర్వహించిన శోభన్‌బాబు సాధారణ బదిలీల్లో భాగంగా ప్రకాశం జిల్లా ఒంగోలు పీటీసీకి వెళ్లారు. వినుకొండ రూరల్ సీఐ ప్రభాకర్‌ను పట్టణ సీఐగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది సీఐను కలిసి అభినందించారు.

నిధులు మంజూరుచేయాలి

● సీఈవోతో ఎమ్మెల్యే అరవిందబాబు భేటీ



జడ్పీ సీఈవో జ్యోతిబసుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవిందబాబు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోటేశ్వరరావు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట నియోజకవర్గానికి సంబంధించిన జడ్పీ నిధులు త్వరితగతిన మంజూరుచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. బుధవారం ఉమ్మడి గుంటూరు జిల్లా జడ్పీ సీఈవో ఈ జ్యోతిబసును ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు కలిశారు. జడ్పీ నిధులు మంజూరు గురించి చర్చించారు. కార్యక్రమంలో కల్చరల్ డైరెక్టర్ బండారు విశ్వేశ్వరరావు, దొండపూడి శివరామకృష్ణ, శ్రీనివాసరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

పుష్పగిరిపీఠం భూముల రిజిస్ట్రేషన్‌ను త్వరగా పూర్తిచేయాలి

మండలంలోని లింగంగుంట్ల పుష్పగిరి పీఠం భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు కోరారు. బుధవారం గొల్లపూడిలోని ఎండోమెంట్ కమిషనర్ రామచంద్ర మోహన్‌ను కలిశారు. కార్యక్రమంలో గంగుల పెద్దిరెడ్డి, మోహన్‌రెడ్డి, ప్రసాద్, యన్నం రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మినుము పైరును పరిశీలిస్తున్న ఏవో వరలక్ష్మి

మినుము పంట పరిశీలన

వినుకొండ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసనాయునిపాలెం, కొప్పుకొండ గ్రామాల్లో రైతులు సాగుచేస్తున్న మినుముపంటను ఏవో జి.వరలక్ష్మి, ఏఈవో ఆరిఫ్, వీఏవో పురుషోత్తంరెడ్డి పరిశీలించారు. పల్లాకు తెగులు రాకుండా వేపగింజల కషాయం లేదా వేపనూనె, ఎసిపేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని రైతులకు అవగాహన కలిగించారు. పసుపు రంగు అట్టలను ఎకరానికి పదిచొప్పున పైరుకి మూర ఎత్తులో పెట్టడం ద్వారా తెల్లదోమ జిగురు అట్టలకు అంటుకొని చనిపోతుందని తద్వారా తెల్లదోమ వ్యాప్తిని అరికడితే పల్లాకు తెగులు నివారించవచ్చన్నారు. పొలాల్లో నీరు నిలవకుండా చూసుకోవాలని, భూమిలో నిల్వ ఉన్న భాస్వరాన్ని కరిగించి మొక్కకు అందించటానికి పీఎస్బీ ఒక లీటరు హెక్టార్‌కు ఇసుకలోకలిపి చల్లాలన్నారు.

భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

వినుకొండ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వినుకొండ మండలంలోని చీకటీగలపాలెం మోడల్ స్కూల్‌లో 8, 9వ తరగతి విద్యార్థులకు భూసార పరీక్షల వల్ల ఉపయోగాలు మట్టి నమూనాతీసే విధానం గూర్చి ప్రయోగాత్మకంగా వివరించారు. మోడల్ స్కూల్‌లోని 8, 9వ తరగతి విద్యార్థులకు 50మట్టి నమూనాలను తీసి మృత పరీక్ష కిట్టు ద్వారా భూసార పరీక్షలు నిర్వహించారు. పరీక్ష ఫలితాలను గ్రామసభ పెట్టి స్కూల్ విద్యార్థులకు, రైతులకు భూసార పరీక్ష కేంద్రం నరసరావుపేట వ్యవసాయ అధికారి యాకోబు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీమతి వి.పద్మావతి, సైన్స్ టీచర్ ఏడుకొండలు, ఇంగ్లీష్ టీచర్ శారద, జువాలజీ టీచర్ ఖాసిం పీరా, మండల వ్యవసాయాధికారి జీ వరలక్ష్మి, ఏఈవో ఆరిఫ్, భూసార పరీక్ష కేంద్రం ఏఈవో విజయ దుర్గ పాల్గొన్నారు.

నాదెండ్ల ఎంపీడీవోగా స్వరూపరాణి

నాదెండ్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నాదెండ్ల ఎంపీడీవోగా ఎస్ స్వరూపరాణిని నియమిస్తూ జడ్పీ సీఈవో జ్యోతిబసు బుధవారం సాయంత్రం ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆమెకు ఎంపీడీవోగా పదోన్నతి రావటంతో రెంటచింతలకు బదిలీ అయ్యారు. కాగా డిప్యూటేషన్‌పై ఆమెను ఎంపీడీవోగా నియమిస్తూ ఆదేశాలు జారీచేశారు. నాదెండ్ల ఎంపీడీవోగా పనిచేస్తున్న శ్రీనివాసరావును రెంటచింతల ఎంపీడీవోగా డిప్యూటేషన్‌పై నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

నీటి కుంటలతో జల సిరులు

● కలెక్టర్ కృతికా శుక్లా



చెక్ డ్యామ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

బొల్లాపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నీటి కుంటలతో జల సిరులు పెరగనున్నాయని, భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా ఉపాధి హామీ పథకం అనుసంధానం చేస్తున్నట్లు కలెక్టర్ కృతికా శుక్లా వెల్లడించారు. బుధవారం బొల్లాపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామంలోని 8/8 నీటి కుంటను పరిశీలించి వాటి గురించి రైతులకు వివరించారు. ఉపాధి హామీ పథకాను ఉపయోగించుకుని ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ముందు ఇంకుడు కుంటలు ఏర్పాటు చేసుకోవాలని, పండ్ల మొక్కలు సాగుచేసుకుని అధిక లాభాలు పొందాలన్నారు. ఉపాధి కూలీలతో పాటు గ్రామంలోని వారందరికీ పనులు కల్పించాలన్నారు. గ్రామంలోని మైక్రో ఇరిగేషన్ శాఖ అధికారులతో కలసి చెరువుకట్టను పరిశీలించారు. అక్కడకు వచ్చిన కొందరు రైతులు గ్రామంలో బస్ షెల్టర్ లేదని, ప్రభుత్వ వైద్యశాలలో వైద్య సేవలు సక్రమంగా అందించటం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. జిల్లాలో బొల్లాపల్లి, వెల్దుర్తి మండలాల్లో నీటి వనరులు అడుగంటాయని, ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతలు, సేద్యపు కుంటలు ఏర్పాటుచేసుకుంటే భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి, పీడీ సిద్ధలింగమూర్తి, తహసీల్దార్ ఏ సుధాకర్, ఎంపీడీవో పీ మాధురి, కృష్ణకుమారి, ఏడీఏ రవి కుమార్, ఏవో అంకారావు, హార్టికల్చర్ హెచ్‌వో షేక్ నబీ రసుల్లా, పంచాయతీరాజ్ అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అట్టహాసంగా మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



రొంపిచర్ల: క్రీడలను ప్రారంభిస్తున్న పద్మావతి

రొంపిచర్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల జడ్పీ పాఠశాలలో పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. పోటీలను సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ నరసింహారెడ్డి, పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ పద్మావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. క్రీడా స్ఫూర్తితో ఆడి రాణించాలన్నారు. అనంతరం మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల క్రీడాకారులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా వంటి క్రీడలను నిర్వహించారు. ఆయా పాఠశాలలకు చెందిన క్రీడాకారుల మధ్య పోటీలు హోరాహోరీగా జరిగాయి. అండర్-14, అండర్-17 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. మొదటి రోజు 225మంది పోటీల్లో పాల్గొన్నారు. విజేతల వివరాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుభానీ, ఫిజికల్ డైరెక్టర్ సైదయ్య, మాజీ హెచ్‌ఎం రామకృష్ణారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ చైర్మన్ ఇట్టే కొండలు పాల్గొన్నారు.

● పొట్లూరు (శావల్యాపురం) అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పొట్లూరు జడ్పీ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మండలస్థాయి క్రీడా పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎంఈవోలు మద్దిగుంట్ల సాంబశివరావు, పుసులూరి లలితాకుమారి ముఖ్యఅతిథులుగా పాల్గొని క్రీడా పోటీలు ప్రారంభించారు. పోటీల్లో పాల్గొనేందుకు వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులను పరిచయం చేసుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అండర్-14, అండర్-17 విభాగాలలో బాలబాలికలకు చెస్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. ఎంఈవోలు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలలో ప్రతిభ చూపి ఉన్నతస్థాయికి ఎదిగేందుకు స్కూల్‌గేమ్స్ ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులంతా క్రీడల్లో తమ సత్తాను చాటాలన్నారు. గ్రామ సర్పంచ్ పోపూరి జ్యోతి, ఎస్‌ఎంసీ చైర్మన్ చింతా సైదారామారావు, హెచ్‌ఎం సింగంశెట్టి అన్నపూర్ణమ్మ, మండల స్కూల్ గేమ్స్ కోఆర్డినేటర్ అనూరాధ, హెచ్‌ఎంలు మురళీకృష్ణ, విన్సెంట్ ఫిలోమిన్, పీడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఈపూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చర్ల హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండల స్థాయి ఆటల పోటీలను టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రావర్ల జగ్గారావు, సొసైటీ డైరెక్టర్ అయినాల కోటేశ్వరరావు ప్రారంభించారు. అండర్-14, 17 విభాగాలలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, చెస్, యోగా పోటీలను నిర్వహించారు. మండల స్థాయి ఆటల పోటీలలో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులు డివిజన్ స్థాయిలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీ నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు గోనుగుంట్ల శరభయ్య, మండల కో-ఆర్డినేటర్ ఏ వీరాంజనేయులు, పీడీలు ఎం.వెంకటేశ్వర్లు, ఏసురాజు, గోపి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● నూజెండ్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆటల పోటీలు స్థానిక జడ్పీ పాఠశాలలో బుధవారం ఉత్సాహ భరిత వాతావరణంలో జరిగాయి. ఆటల పోటీలను ఎంపీడీవో పీ ఉమాదేవి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ లగడపాటి వెంకటరావు, త్రిపురాపురం డీసీ చైర్మన్, పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు గంగినేని రాఘవ, పీఎంసీ చైర్మన్ ముప్పాళ్ళ శ్రీను, ఎంఈవోలు కే సత్యనారాయణ, ఎన్.రవిచంద్ర, హెచ్‌ఎం శ్రీదేవి, స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఎన్ వీ రత్నం, సర్పంచ్ వీర్ల వెంకటస్వామి, గంగినేని బ్రహ్మయ్య తదితరులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు. మొదటి రోజు ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలను ఫిజికల్ డైరెక్టర్లు నిర్వహించారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్ర పరిశీలన



ఈపూరులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి

ఈపూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఈపూరులో దారా ప్రకాష్‌రావు వ్యవసాయ క్షేత్రాన్ని బుధవారం పల్నాడు జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ ఏ అమలకుమారి బుధవారం పరిశీలించారు. వ్యవసాయక్షేత్రంలో వరిలో అంతర పంటలు సాగుచేశాడు. ఈ సందర్భంగా అమలకుమారి మాట్లాడుతూ అంతర పంటలుగా కూరగాయల సాగుచేయడం వలన ఆదాయం వస్తుందని, ప్రధాన పంటకు కావలసిన పెట్టుబడి అంతర పంటల వలన వస్తుందన్నారు. అంతేకాకుండా భూమికి అన్ని రకాల పోషకాలు లభించి, భూమి ఆరోగ్యంగా ఉండి, వరికి చీడపీడల బెడద కూడా తగ్గుతుందన్నారు. వరికి ఆక్సిజన్ బాగా అందడం వలన అధికశాతం పిలకలు వస్తాయన్నారు. అనంతరం రైతు సేవాకేంద్రంలో రైతులకు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి భూసార పరీక్షలు నిర్వహించే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో ఆర్.రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన

నూజెండ్ల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల విద్యాలయంలో బుధవారం వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్కూల్‌లో విద్యార్థులకు భూసార పరీక్ష, భూమి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. సేంద్రీయ వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమల కుమారి, నరసరావుపేట ఏఎంసీ సాయిల్ టెస్టింగ్ ల్యాబ్ వ్యవసాయ అధికారి యాకోబు, పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.నాగేశ్వరమ్మ, వైస్ ప్రిన్సిపాల్ కే.విశాలక్ష్మి, ఉపాధ్యాయినులు కే మల్లేశ్వరి, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

వైసీపీ నేతల డైరెక్షన్‌లోనే అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం

● టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్



నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిరణ్, ఎస్సీ సెల్ నాయకులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల డైరెక్షన్‌లోనే అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం జరిగిందని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్ ఆరోపించారు. నరసరావుపేటలోని అంబేడ్కర్ విగ్రహానికి బుధవారం పాలాభిషేకం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకే వైసీపీ నేతలు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసంచేసి ప్రభుత్వం మీద బురద చల్లడానికి ప్రయత్నించిన వైసీపీ నీచ సంస్కృతిని ప్రజాసంఘాలు, కుల సంఘాలు ముక్తకంఠంతో ఖండించాలన్నారు. చిత్తూరు జిల్లా వెదురుకుప్పంలో అంబేడ్కర్ విగ్రహంపై దాడి దళితుల మనోభావాలపై దాడి చేయడమేనన్నారు. విగ్రహధ్వంసం కేసులో వైసీపీ నేతలు గోవిందయ్య, ఇతరులు స్వయంగా పట్టుబడి జైలుకు వెళ్ళినా జగన్‌రెడ్డి మౌనంగా ఉండటం దేనికి సంకేతం అన్నారు. విగ్రహాలు పగలగొట్టడం, తగలబెట్టడం రాష్ట్రంలో అశాంతిని రేకెత్తించేలా కుట్రలు చేయడం వైసీపీ నీచ రాజకీయ పేటెంట్ అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనంతా దళితులపై దాడులు, విధ్వంసాలే జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు కుంపటి రవి, జీపీ కుమార్, చింతిరాల బాలు, గిద్దల వెంకటేశ్వర్లు, మల్లవరపు శ్యామ్, కొల్లిపోగు సునీల్, నాయుడు, వర్ల బాబురావు తదితరులు పాల్గొన్నారు.



ఇటీవల యూపీలోని నోయిడా బిట్స్ పిలానీ హాస్టల్లో జరిగిన కాల్పుల ఘటనలో మృతిచెందిన ఎంబీఏ విద్యార్థి దివ్వెల దీపక్(23) కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు - చిలకలూరిపేట

18 నుంచి చెకుముకి సంబరాలు

చిలకలూరిపేట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక చెకుముకి సంబరాలు ఈ నెల 18న పాఠశాలల స్థాయిలో నిర్వహించనున్నట్టు సంస్థ డివిజన్ ప్రధాన కార్యదర్శి బి.అజయ్‌బాబు బుధవారం తెలిపారు. ఈ గోడపత్రికను చిలకలూరిపేటలో రోటరీ హాలులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రథమస్థానంలో నిలిచినవారికి మండల స్థాయిలో నవంబరు 1న సంబరాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ధూళిపాళ వెంకట్రావు, ప్రచురణల కమిటీ రాష్ట్ర కన్వీనర్ డా.దార్ల బుజ్జిబాబు, సాహితీవేత్తలు డా.కందిమళ్ళ సాంబశివరావు, డా. సుబ్బారావు, డా.విన్సెంట్‌పాల్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

● కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ శ్రీవాస్తవ



విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న చిత్రం

నాదెండ్ల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ నీరజ్‌కుమార్ శ్రీవాస్తవ అన్నారు. కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, నరసరావుపేట రోటరీ క్లబ్ సంయుక్తంగా కనపర్రులోని ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటడంపై అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న రోటరీ క్లబ్ అధ్యక్షుడు షేక్ కరీం మొహిద్దీన్ మాట్లాడుతూ అటవీ శాఖ సహకారంతో ఐదు వేల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకొని కనపర్రులో మూడు వేల మొక్కలను విద్యార్థులకు పంపిణీ చేశామన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటి విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, ప్రిన్సిపాల్ నాగమల్లేశ్వరరావు, ఎండీ షేక్ మస్తాన్‌షరీఫ్, ప్రధానోపాధ్యాయులు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

నరసరావుపేట లీగల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ ప్రదేశాల్లో కల్తీ మద్యం పట్టుబడిన నేపథ్యంలో పల్నాడు జిల్లా ఎక్సైజ్ శాఖ జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేపట్టింది. బుధవారం జిల్లావ్యాప్తంగా 142 వైన్ షాపులు, 32బార్లను సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేశారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్లు ప్రత్యేక బృందాలు అనుమానిత ప్రదేశాల్లో దాడులు నిర్వహించాయి. దాడుల్లో ఎటువంటి అనుమానిత లిక్కర్, హానికరమైన పదార్థాలు పట్టుబడలేదని, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ కూడా లభించలేదని జిల్లా ఎక్సైజ్ అధికారి మణికంఠ తెలిపారు. ఇటీవల పట్టణంలో ఓ వ్యక్తి కల్తీ మద్యం సేవించి మృతి చెందినట్లు వచ్చిన వార్తల్లో వాస్తవం లేదన్నారు. అనారోగ్యంతో మృతి చెందాడన్నారు. ఈ మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు కూడా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

విద్యార్థులకు క్రీడా పరికరాల పంపిణీ

యడ్లపాడు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేటకు చెందిన స్వచ్ఛంద సంస్థ అసిస్ట్, ఐటీసీ సంస్థల సహకారంతో మండలంలోని లింగారావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు క్రీడా పరికరాలను అందజేశారు. బుధవారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంఈవో నాగరత్న విద్యార్థులకు వివిధ రకాల క్రీడా పరికరాలను అందించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులలో క్రీడాసక్తిని పెంపొందించి ప్రోత్సహించేందుకు క్రీడా వస్తువులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్ట్ అసోసియేట్ డైరెక్టర్ జె.కృష్ణహరీష్, కో-ఆర్డినేటర్లు రత్నకుమార్, వెంకయ్య, శ్రీనివాస్, హెచ్‌ఎం కేవీ రామిరెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

డిసెంబరు 7న ఉపకార వేతనం కోసం ప్రతిభా పరీక్ష

● అక్టోబరు 15లోపు దరఖాస్తు చేసుకోవాలి
● 16లోపు పరీక్షరుసుం చెల్లించాలి: డీఈవో

నరసరావుపేట టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 7న జరగనున్న ఎన్‌ఎంఎంఎస్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఆన్‌లైన్ అప్లికేషన్ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఈవో ఎల్.చంద్రకళ బుధవారం తెలిపారు. పరీక్షకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి ఈ నెల 15వరకు పొడిగించామని, ఆన్‌లైన్ పరీక్ష రుసుం చెల్లించేందుకు అక్టోబరు 16వ వరకు చివరి తేదీ పొడిగించామన్నారు. సంబంధిత ప్రింటెడ్ నామినల్ రోల్స్‌ను డీఈవో కార్యాలయంలో అక్టోబరు 18వ తేదీలోపు సమర్పించాలన్నారు.దరఖాస్తు చేసుకునేందుకు ఎటువంటి ధ్రువపత్రాలు అవసరం లేదన్నారు. పరీక్ష రాసే సమయంలో అన్ని ధ్రువపత్రాలు సిద్ధం చేసుకోవాలన్నారు. పరీక్ష రుసుం ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాలన్నారు. అదనపు సమాచారం కోసం డీఈవో కార్యాలయంలో డీఎస్‌వో పీ శంకర్‌రాజు, సెల్ 9963192487ను సంప్రదించాలన్నారు.



ఘన ద్రవ వ్యర్థాలకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు తదితరులు

వ్యర్థాల నిర్వహణపై అసిస్ట్ కృషి ప్రశంసనీయం

● ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

చిలకలూరిపేట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక అసిస్ట్ సంస్థ వారు ఐటీసీ సంస్థతో కలిసి పల్నాడు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల వారికి ఘన, ద్రవవ్యర్థాల సక్రమ నిర్వహణపై శిక్షణతో పాటు అవగాహన కల్పిస్తూ చేస్తున్న కృషిని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రశంసించారు. పట్టణంలోని అసిస్ట్ సంస్థ కార్యాలయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఘన, ద్రవ వ్యర్థాలకు సంబంధించి ఐఈసీ పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సేవలను వినియోగించుకోవాలని, స్వచ్ఛ పల్నాడు సాధనకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో అసిస్ట్ సంస్థ అధినేత డాక్టర్ జే రంగారావు, అసోసియేట్ డైరెక్టర్లు జే కృష్ణహరీష్, ఎం.విష్ణుప్రియ, కోఆర్డినేటర్లు రత్నకుమార్, శ్రీనివాస్, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

కళాకారుల అభ్యున్నతే గుమ్మడి కళాపీఠం లక్ష్యం

● గుమ్మడి వెంకటేశ్వరు

వినుకొండ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కళాకారుల అభ్యున్నతే గుమ్మడి కళాపీఠం లక్ష్యం గుమ్మడి వెంకటేశ్వర్లు అన్నారు. మూడు రోజుల నుంచి పట్టణంలోని పెద్ద పోస్టాఫీస్ వద్ద నియోజకవర్గంతోపాటు పక్క జిల్లాల కళాకారులకు సెంట్రల్ గవర్నమెంట్ పోస్టల్ యాక్సిడెంట్ బీమా రూ.5లక్షల పాలసీని కళాపీఠం ఆధ్వర్యంలో అందజేస్తున్నట్లు ఆయన బుధవారం తెలిపారు. కళాకారులు అర్ధరాత్రిలో ఈవెంట్లకు వెళుతూ యాక్సిడెంట్లకు గురై చనిపోతే కుటుంబం రోడ్డున పడుతుందన్నారు. వారికి తన సొంత నిధులతో ప్రమాద బీమా చేయిస్తున్నట్లు తెలిపారు.ఇప్పటివరకు 45మంది కళాకారులకు 20 వేల పైచిలుకు ఖర్చుతో ప్రమాదబీమా చేయించి కార్డులు అందజేశామన్నారు. ప్రభుత్వం కళాకారులకు కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కళాకారులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాలకృష్ణ, అధ్యాపకులు తదితరులు

పీఎన్‌సీ అండ్ కేఆర్ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక పీఎన్‌సీ అండ్ కేఆర్ డిగ్రీ కళాశాలలో హైదరాబాద్ దివీస్ ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో డిగ్రీ చదివిన విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు బుధవారం నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలలో వివిధ కళాశాలలకు చెందిన 52మంది విద్యార్థులు పాల్గొనగా 20మంది విద్యార్థులను ఎగ్జిక్యూటివ్, జూనియర్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎం.ప్రేమ్‌చంద్ మాట్లాడుతూ కళాశాల ప్లేస్మెంట్స్ సెల్ ఆధ్వర్యంలో ప్రతి విద్యార్థికి డిగ్రీ పూర్తిచేసే సమయానికి ఉద్యోగం కల్పించేలా కృషి చేస్తున్నామన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు డిగ్రీ సర్టిఫికెట్లు అందుకున్న వెంటనే ఉద్యోగంలో చేరవలసి ఉంటుందని చెప్పారు. వీరికి రూ.2.50 లక్షల నుంచి రూ.3లక్షలవరకు వార్షిక వేతనం అభిస్తుందని జాయింట్ సెక్రటరీ పాలడుగు శ్రీనివాసప్రసాద్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మేజర్ జీ వెంకటేశ్వరరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాలకృష్ణ, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా జాయింట్ కమిషనర్ జాన్ స్టీవెన్సన్ పాత్రో, మాజీ మున్సిపల్ చైర్మన్ సుబ్బరాయగుప్తా తదితరులు

సూపర్ జీఎస్‌టీతో ప్రజలకు తగ్గిన భారం

● జాయింట్ కమిషనర్ జాన్ స్టీవెన్సన్ పాత్రో

నరసరావుపేట టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్‌టీ, సూపర్ సేవింగ్స్‌తో ప్రజలకు ఖర్చు భారం తగ్గుతుందని రాష్ట్ర ట్యాక్స్ జిల్లా జాయింట్ కమిషనర్ జాన్‌స్టీవెన్సన్ పాత్రో అన్నారు. ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం సూపర్ జీఎస్‌టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జాన్ స్టీవెన్సన్ పాత్రో మాట్లాడుతూ ఈ కార్యక్రమం వినియోగదారులకు అవగాహన కల్పించడమే కాకుండా దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించే దిశగా తీసుకున్న నిర్ణయం అన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్తా, అసిస్టెంట్ కమిషనర్లు ఎం రామారావు, రంగయ్య, జీఎస్‌టీ ఆఫీసర్ పున్నారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధీర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శ్రీనివాససాయి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు టీవీ శంకర్‌రెడ్డి, డాక్టర్ ఏ సరళాదేవి, డాక్టర్ రాజనాల వేణుమాధవ్, వీ శ్రీనివాసులు, ఎం.అనిల్ కుమార్, డాక్టర్ ఐ.సదాశివరెడ్డి, పీ రాంబాబు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం

నాదెండ్ల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వినియోగంతో భవిష్యత్తు నాశనం అవుతుందని ఎస్ఐ పుల్లారావు అన్నారు. గణపవరంలోని కెల్లంపల్లి భద్రాచలం హైస్కూల్లో లిక్కర్, గంజాయి, మాదకద్రవ్యాల వినియోగంతో జరిగే నష్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండకపోతే భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. ఎవరైనా మాదక ద్రవ్యాలు విక్రయించినా, రవాణా చేసినా విద్యార్థులు, ఉపాధ్యాయులు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

శానిటరీ విభాగం డ్రైవర్ మృతి

చిలకలూరిపేట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక పురపాలక సంఘం శానిటరీ విభాగంలో డివిజన్1లో డ్రైవర్‌గా పనిచేసే షేక్ రబ్బానీ(40) బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందాడు. రబ్బానీ తీవ్ర జ్వరంనుండి ఇటీవలే కోలుకొని తిరిగి విధుల్లో చేరాడు. రబ్బానీ మృతికి శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రమణారావు, తోటి డ్రైవర్లు, పారిశుధ్య కార్మికులు సంతాపం ప్రకటించారు.

12వ వార్డులో వీధికి ద్రౌపతి ముర్ము పేరు

పట్టణంలోని 12వ వార్డు బాలాజీ రోడ్డు నుంచి చార్లెస్‌కు వెళ్లే రోడ్డుకు ద్రౌపతి ముర్ము వీధి అని నామకరణం చేశారు. ఇందుకు సంబంధించిన బోర్డును మున్సిపల్ చైర్మన్ షేక్‌రఫాని బుధవారం ఆవిష్కరించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, డీఈ రహీం, ఏఈ మణి పాల్గొన్నారు.